ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

బుధవారం 7 మే 2025 | 5

రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0 (మంగళవారం)
కనిష్ఠం : 26.0

నేటి నుంచే సత్యదేవుడి దివ్య కల్యాణోత్సవాలు 7

వక్ఫ్ సవరణం!



వక్ఫ్ చట్టాన్ని సవరిస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకిస్తూ ఎన్నడూలేనిది బురఖాలు ధరించి ముస్లిం మహిళలు రోడ్డెక్కారు.. జాతీయ జెండా చేతబూని జై భారత్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.. వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో అజాద్ చౌక్ నుంచి ర్యాలీ సాగింది. - వివరాలు 7లో

క్యాన్సర్ కలవరం!



- వేలల్లో అనుమానిత కేసులు
- 2.0 సర్వేలో 16,432
- 3.0. సర్వేలో 21వేలుపైనే
- కాకినాడలోనే 8,383 కేసులు
- 21 మందికి క్యాన్సర్ నిర్ధారణ
- రాష్ట్రంలోనే కాకినాడ జిల్లా ఫస్ట్
- ఆసుపత్రి ఏర్పాటు యోచన
- రూ.10 కోట్లతో ప్రతిపాదనలు
- కాకినాడ కలెక్టర్ చొరవ
- క్యాన్సర్ పరీక్షలకూ వాహనం

ఉమ్మడి జిల్లాలో విజృంభిస్తోన్న మహమ్మారి

క్యాన్సర్.. ఎప్పుడు వస్తుందో.. ఎక్కడ వస్తుందో.. ఎలా వస్తుందో తెలియదు.. ఏదో అనుమానం ఉంటే తప్ప ప్రాథమిక దశలో గుర్తించడం కూడా కష్టమే. నూటికి 50 నుంచి 60 శాతం కేసులు చివరిలోనే గుర్తిస్తారు.. దాంతో సకాలంలో చికిత్స అందక క్యాన్సర్‌కు ఎందరో బలైపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇటీవల జరిపిన సర్వే విస్తుపోయే నిజం బయటకు వచ్చింది.. మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో క్యాన్సర్ మహమ్మారి విజృంభిస్తోందని తేలింది.. కాకినాడ క్యాన్సర్ అనుమానిత కేసుల్లో తొలిస్థానంలో ఉంటే.. తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాలు 10, 11వ స్థానాల్లో ఉండడం కలవరపెడుతోంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో క్యాన్సర్ అనుమానిత కేసులు కలవరపెడుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ సర్వేలో వేలకు వేలు అనుమానిత కేసులు వెలుగులోకి వస్తున్నాయి. ఏ మండలంలో చూసినా నోటి, సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు ఉన్న బాధితులు ఎక్కువగా తేలుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఎన్‌సీడీ (నాన్ కమ్యునబుల్ డిసీజ్) 2.0 సర్వేలో ఉమ్మడి జిల్లాలో 16,432 మందిలో క్యాన్సర్ అనుమానిత లక్షణాలు గుర్తించగా తాజాగా పూర్తయిన ఎన్‌సీడీ 3.0 సర్వేలో ఏకంగా 20వేలకుపైగా కేసులు వెలుగులోకి రావడం క్యాన్సర్ తీవ్రతను చాటుతోంది.

అంతకంతకూ విజృంభణ..

రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో క్యాన్సర్ కేసులు విజృంభిస్తున్నాయి. మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలి కారణంగా క్యాన్సర్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం జనవరిలో ఆదేశించింది. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇంటింటికీ వెళ్లి ఆయా జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది క్యాన్సర్‌తోపాటు పలు రకాల వ్యాధులపై సర్వే చేశారు. హైపర్ టెన్షన్, డయాబెటిస్, లివర్ వ్యాధులు సైతం భారీగా ఉమ్మడి జిల్లాలో వెలుగులోకి వస్తున్నా వీటికి మించి భయపెట్టేలా క్యాన్సర్ అనుమానిత కేసులు గుర్తిస్తుండడం కలవరపాటుకు గురిచేస్తోంది.

రాష్ట్రంలో కాకినాడ ఫస్ట్..

కాకినాడ జిల్లాలో అత్యధికంగా కేసులు ఉండడం కలవరపెడుతోంది. 2.0 సర్వేలో కాకినాడ జిల్లాలో 6,333 కేసులు గుర్తించారు. 3.0 సర్వేలో ఏకంగా 8,383 కేసులు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటివరకు వీరిలో చాలామందికి పూర్తిస్థాయి టెస్టులు చేయగా 21 మందికి క్యాన్సర్ నిర్ధారణ అయింది. ఇన్ని కేసులతో కాకినాడ జిల్లా రాష్ట్రంలో తొలిస్థానంలో నిలిచింది. ఈనేపథ్యంలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వానికి రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. నిధులు వేగంగా విడుదలచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎస్సార్ నిధుల ద్వారా ప్రత్యేక క్యాన్సర్ స్ర్కీనింగ్ టెస్టులు జరిపే మొబైల్ వాహనాన్ని కూడా అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఈ మేరకు ఓఎన్జీసీతో మాట్లాడారు. ఈ మొబైల్ వాహనం ద్వారా రోజుకు వెయ్యిమందికి టెస్టులు చేసే ఆధునిక పరికరాలు అందుబాటులోకి రానున్నాయి. తద్వారా తక్కువ సమయంలో ఎక్కువ మందికి టెస్టులు చేయవచ్చని కలెక్టర్ వివరించారు. తూర్పుగోదావరి జిల్లా 5,103 అనుమానిత క్యాన్సర్ కేసులతో పదో స్థానంలో నిలిచింది. కోనసీమ జిల్లా 4,996 కేసులతో 11వ స్థానంలో నిలిచింది. ఉమ్మడి జిల్లాలో ఎన్‌సీడీ 2.0 సర్వేలో క్యాన్సర్ అనుమానిత కేసులు 16,432 తేలాయి.

ఉమ్మడి జిల్లాలో అనుమానితులు 21 వేలు

- గత మార్చిలో ప్రభుత్వం మూడో దశ ఎన్‌సీడీ సర్వే చేపట్టింది. ఈ సర్వేలోనూ క్యాన్సర్ అనుమానిత కేసులు ఉమ్మడి జిల్లాలో ఏకంగా 21 వేలు గుర్తించారు. కాకినాడ జిల్లాలో అయితే 3.0 సర్వేలో ఏకంగా 8,383 అనుమానిత కేసులు గుర్తించారు. ఓరల్ క్యాన్సర్ విభాగంలో 3,995, బ్రెస్ట్ క్యాన్సర్ విభాగంలో 2,337, సర్వైకల్ క్యాన్సర్ విభాగంలో 2,051 మంది అనుమానితులుగా గుర్తించారు. వీరిని కాకినాడ జీజీ హెచ్‌కు రిఫర్ చేశారు. ఇలా ఓరల్ క్యాన్సర్ పరీక్షలకు పంపిన 56 మందిలో 12 మందికి క్యాన్సర్ నిర్ధారణ అయింది. బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు ఉన్న 78 మందిలో ఐదుగురికి క్యాన్సర్‌గా తేలింది. సర్వైకల్ క్యాన్సర్ లక్షణాలు ఉన్న 21 మందిలో నలుగురికి వ్యాధి నిర్ధారణ అయింది.
- తూర్పుగోదావరి జిల్లాలో 6,413 మందిలో అనుమానిత లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. ఓరల్ క్యాన్సర్ విభాగంలో 3,186 అనుమానిత కేసులు గుర్తించగా లోతైన వైద్య పరీక్షలకు 44 మందిని రాజమహేంద్రవరం జీజీహెచ్ అంకాలజీకి రిఫర్ చేశారు. బ్రెస్ట్ క్యాన్సర్ విభాగంలో 1,800 అనుమానిత కేసులుండగా 97 మందిని లోతైన టెస్టులకు రిఫర్ చేశారు. సర్వైకల్ క్యాన్సర్ విభాగంలో 1,427 అనుమానితులను గుర్తించగా 24 మందిని జీజీహెచ్‌కు పంపారు. ఈ అనుమానిత కేసుల్లో నలుగురికి బ్రెస్ట్ క్యాన్సర్, మరో నలుగురికి ఓరల్ క్యాన్సర్ నిర్ధారణ అయింది. మిగిలిన వారికి పరీక్షలు జరుగుతున్నాయి.
- కోనసీమ జిల్లాలో ఎన్‌సీడీ 2.0 సర్వేలో 4,996 కేసులు గుర్తించగా తాజా సర్వేలో ఐదు వేలకుపైగా అనుమానితులను గుర్తించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనుమానిత కేసులు, నిర్ధారణ అవుతున్న కేసులు అంతకంతకూ పెరుగుతున్నట్టు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వివరించారు. బాధితుల్లో ఎక్కువగా 40 నుంచి 64 ఏళ్ల మధ్య వయసున్న వారు అధికంగా ఉంటున్నారని తేలింది.



బలభద్రపురంలో క్యాన్సర్ పరీక్షలు (ఫైల్)

అసెంబ్లీ వేదికగా బిక్కవోలు మండలం బలభద్రపురంలో క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్టు అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. సుమారు ఆ ఒక్క గ్రామంలో 40 మంది క్యాన్సర్ బాధితులను గుర్తించి ఆసుపత్రులకు తరలించారు. ఆ గ్రామంలో కేసులు వేలల్లో ఉంటాయని వాదన.

రూ.10 కోట్లతో ఆసుపత్రి..

క్యాన్సర్ విజృంభణ కారణంగా కాకినాడలో ప్రత్యేకంగా క్యాన్సర్ ఆసుపత్రి నిర్మించాల్సి ఉందని కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఈ మేరకు రూ.10 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపారు. ఆస్పత్రి నిర్మాణానికి స్థలం జీజీహెచ్‌కు సమీపంలో ఉందని నివేదికలో వివరించారు. కాకినాడ జీజీహెచ్ అంకాలజీ విభాగంలో నిపుణులైన క్యాన్సర్ వైద్యులు ఉన్నారన్నారు. నిధులు విడుదల చేయాలని కోరారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ స్ర్కీనింగ్ చేస్తారు. అనుమానితులు వెళ్లి పరీక్షలు చేయించుకునే అవకాశం ఉంది. ఈ కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉంటారు. పరీక్షించి వెంటనే ఫలితం చెబుతారు.

తడిచిన ధాన్యం కొంటాం



ధాన్యం కొనుగోళ్లపై మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

- నూరుశాతం లక్ష్యం
- మిల్లర్లకు ఆదేశాలు
- మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, మే 6 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో రైతులకు అండగా నిలబడాలనే ఉద్దేశంతో నూటికి నూరు శాతం ధాన్యం కొనుగోలు చేస్తున్నామని త్వరితగతిన రైతుల ఖాతాల్లో నగదు కూడా జమ చేస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వర్షం వచ్చి ధాన్యంలో తేమశాతం పెరిగిందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్క రైతు నుంచి ధాన్యం సేకరించి తీరుతామన్నారు. తేమ శాతం పెరిగితే ధాన్యం కొనుగోలు చేయరన్న అపోహలు రైతన్నలు నమ్మవద్దన్నారు.ఏ రకమైన ధాన్యాన్ని అయినా మిల్లర్లు సేకరించి తీరాలని ఆదేశించామన్నారు.తూర్పు గోదావరి జిల్లాలోని నిడదవోలు మండలంలోనే 43,229 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని ఇది రాష్ట్రంలోనే అత్యధికమన్నారు. రైతులంతా సంతృప్తి చెందేలా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు.సమావేశానికి ముందు రెవెన్యూ, వ్యవసాయ శాఖ పౌర సరఫరాలా శాఖ అధికారులతో సమీక్షించారు.నిడదవోలు నియోజకవర్గంలో మత్స్య సంపద వృద్ధి చేసేందుకు సుమారు రూ.1,27,06,075లు విలువైన 255 యూనిట్లకు ప్రతిపాదనలు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, ఏఎస్‌వో ఎం.నాగాంజనేయులు, వ్యవసాయ శాఖ ఏడీ పి.చంద్రశేఖర్,ఏవో జి.సత్యనారాయణ పాల్గొన్నారు.



ధాన్యం సేకరణపై కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో గతం కంటే అధికంగా ధాన్యం కొనుగోలు చేశామని అయితే రికార్డుల నిర్వహణ విషయంలో అధికారులు, సిబ్బంది పనితీరు లోప భూయిష్టంగా ఉందని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రబీ సీజన్‌లో ధాన్యం సేకరణపై సమన్వయ శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ క్రాప్ బుకింగ్ ఆధారంగా ధాన్య కొనుగోలు చేస్తున్నారో లేదో క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా మేనేజరు, పౌరసరఫరాల అధికారి ధాన్యం సేకరణ సీజన్‌లో ప్రతిరోజు క్షేత్ర స్థాయిలో ఆర్ఎస్‌కేలు తనిఖీ చేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి, జిల్లా సహకారఅధికారి, నియోజకవర్గ ప్రత్యేకాధికారులకు ఒక్కొక్క నియోజకవర్గం పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని జాయింట్ కలెక్టర్ చిన్నరాముడుకు సూచించారు. రికార్డుల నిర్వహణ, షెడ్యూల్, కేటాయింపు, కార్యాచరణ, ఈ క్రాప్ బుకింగ్, రవాణా,గన్నీ బ్యాగ్‌లు, తదితర అంశాలపై దృష్టిసారించాలన్నారు.సమావేశంలో ఇన్‌చార్జి డీఎస్‌వో ప్రేమ్‌కుమార్, డీఏవో మాధవరావు, డీసీవో జనార్దనరెడ్డి, ఆర్‌టీవో రమేష్,డీపీఆర్‌వో బాలకృష్ణ పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న బిక్కవోలు రైతాంగం

ధాన్యం కొనాలని రైతుల వినతి

బిక్కవోలు, మే 6(ఆంధ్రజ్యోతి): తాము పండించిన ధాన్యామంతా మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. జేసీ చినరాముడు మంగళవారం సాయంత్రం బిక్కవోలు తహశీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఈ మేరకు సమాచారం అందుకుని అక్కడికి చేరుకున్న రైతులు తమ వద్ద చాలా ధాన్యం ఉందని.. వర్షం వస్తే తడిచి ఎందుకూ పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందని కొనుగోళ్లకు ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై స్పందించిన జేసీ మాట్లాడుతూ మీ మండలానికి ఇచ్చిన టార్గెట్లు పూర్తయ్యాయని, మిల్లర్లకు అమ్ముకోవాలని సూచించారు. అందుకు రైతులు తిరస్కరించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. మండల వ్యవసాయాధికారి శామ్యూల్‌జాన్ మాట్లాడుతూ మండలానికి 13,500 మెట్రిక్ టన్నుల టార్గెట్ ఇచ్చారని అది పూర్తి చేయడం జరిగిందని, అలాగే రైతులు బయట మార్కెట్‌లో కూడ 16,500 మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్ముకున్నారని జేసీకి తెలిపారు. దీంతో జేసీ 3 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు అనుమతించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, అనపర్తి ఏడీఏ డివి.కృష్ణ, తహశీల్దార్ సత్యకృష్ణ, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి వరదలను ఎదుర్కొందాం 6

కుమార్తె కళ్లెదుటే.. తండ్రి దుర్మరణం 7

నేటి నుంచి రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ

రాజమహేంద్రవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం గ్రామ వార్డు సచివాలయాల ద్వారా రేషన్ కార్డులోని ఏడు రకాల సేవలకు సంబంధించి బుధవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని జేసీ చిన్నరాముడు మంగళవారం రాత్రి తెలిపారు. కొత్త రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల జోడింపు, సభ్యుల తొలగింపు, కార్డు సరెండర్, చిరునామా మార్పు, ఆధార్ సీడింగ్‌లో దిద్దుబాట్లకు అవకాశం కల్పించారన్నారు. ఈ మేరకు మండల అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు.ఈ సేవలను జీఎస్‌డబ్ల్యుఎస్ ఏపీ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ద్వారా కూడా చేసుకోవచ్చన్నారు.

నేడు డీఎస్‌పీసీఏ సమీక్ష

రాజమహేంద్రవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన జిల్లా జంతు హింస నివారణ సంఘం (డీఎస్‌పీసీఏ) సమీక్ష సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నామని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి, డీఎస్‌పీసీఏ కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఛైర్‌పర్సన్‌గా, జిల్లా పోలీస్ అధికారి, జంతు ప్రేమికుల్లో ఒకరు వైస్ ఛైర్‌పర్సన్లుగా, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ కోశాధికారిగా, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి కార్యదర్శిగా ఉంటారన్నారు. యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా సంఘం రిజిస్ట్రేషను జరిగిందన్నారు.సంఘంలోని వారంతా సమీక్షకు హాజరు కావాలని శ్రీనివాసరావు కోరారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ఆర్ట్స్ కళాశాల గ్రాడ్యుయేషన్‌డేలో వీసీ ప్రసన్నశ్రీ

రాజమహేంద్రవరం అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ప్రతికూల పరిస్థితులను, సవాళ్లను ఎదుర్కొనే దృఢమైన వైఖరిని పెంపొందించుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రసన్నశ్రీ అన్నారు. రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో మంగళవారం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల పోస్టుగ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. 2018, 2019, 2020 సంవత్సరాల్లో చదివిన 14 గ్రూపుల్లోని 480 మంది విద్యార్థులకు ఒరిజినల్ డిగ్రీలను ప్రదానం చేశారు. నన్నయ్య వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికతో కూడిన విద్యను అభ్యసించి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. గుజరాత్ బీఎంటీయూ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ మధుకర్ భాయ్ ఎస్ పఢ్వీ మాట్లాడుతూ సేవా దృక్పథంతో, సమాజం పట్ల బాధ్యతతో విద్యార్థులు ముందుకు సాగాలని కోరారు. నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే కళాశాల గత నాలుగేళ్లలో సాధించిన ప్రగతిని వివరించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పి.బాబ్జి మాట్లాడుతూ పరీక్షలకు సంబంధించిన నివేదికను అందించారు.కార్యక్రమంలో సీపీడీసీ సెక్రటరీ తుమ్మిడి రామ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, ప్రిన్సిపాల్ రామచంద్ర



పదింతల ఆనందం

22 మంది పది విద్యార్థులకు అభినందన

రాజమహేంద్రవరం, మే 6(ఆంధ్రజ్యోతి): కలలను సాకారం చేసుకొనే దిశలో విజయం సాధించడానికి దగ్గర దారులుండవని, లక్ష్యాన్ని నిర్ణయించుకొని శ్రమించడమే మార్గమని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 580కిపైగా మార్కులు సాధించిన 22 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో అభినందించారు.అనంతరం వారితో భోజనం చేశారు.కలెక్టర్ మాట్లా డుతూ స్వతంత్రంగా ఆలోచించాలన్నారు.తన జీవితంలో ఎందరో ఆదర్శ వ్యక్తులను మోడల్‌గా ఎంపిక చేసుకొని శ్రమించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం జరిగిందన్నారు. నిరంతర శ్రమ, అభ్యసనం ద్వారా మాత్రమే ఉన్నతమైన లక్ష్యాలను చేరుకోగలమని ఎస్పీ నరసింహ కిశోర్ అన్నారు.జేసీ చిన్న రాముడు మాట్లాడుతూ ఒక పూట అన్నం కోసం ఎదురు చూసే కుటుంబం నుంచి వచ్చి ఎంతో శ్రమించి తాను ఈ స్థాయిలో ఉన్నానని, చదువుతోనే మంచి మార్పు సాధ్యమన్నారు.తాను ఎనిమిది రకాల ఉద్యోగా లను చేసి..నిరంతర శ్రమ, పట్టుదల, క్రమశిక్షణ మాత్రమే నా ఐఏఎస్ కల నిజం చేశాయని కమిషనర్ కేతన్ గార్గ్ వెల్లడించారు.

వాహ నిజం!

ఇతగాడి మేనరిజం



డబుల్ సైకిల్‌పై సవారీ..



కారుగా మారిపోయిన యాక్టివా...

కలలు కనండి..వాటిని నిజం చేసుకోండి.. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పిన మాట.. ఆ మాటను ఆచరించే యువత కోకొల్లలు.. ఆ కోవలోకే వస్తాడు రాజ్‌కుమార్.. పుట్టింది కుగ్రామంలో అయినా చిన్నతనం నుంచి ఏదో ఒకటి కొత్తగా చేయాలనే తపన.. అందులో నుంచి పుట్టిందే విభిన్న ఆకారాల్లో వాహనాల రూపకల్పన.. చిన్నతనం కార్లు అంటే చాలా ఇష్టం.. అది మామూలు కార్లు కాదండోయ్.. ఇటీవల కల్కి సినిమాలో బుజ్జి కారు చూశారా.. అలా ఉండాలి.. మరి అటువంటి కార్లు మార్కెట్‌లో లభ్యమవుతాయా.. కష్టమే కదా.. ఉన్నా కొనలేం. అందుకే తన బుర్రకే పదును పెట్టాడు.. ఇదిగో ఇలా తన వద్ద ఉన్న పరికరాలతోనే తనకు నచ్చినట్టు వాహనాలు తయారుచేసుకుని అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు.. యూట్యూబ్ చానల్ వేదికగా వీక్షకులతో శెహబాష్ అనిపించుకుంటున్నాడు.. - పి.గన్నవరం-ఆంధ్రజ్యోతి

సోషల్ మీడియా నేటి తరం యువతకు ఒక అద్భుత వేదిక.. వారిలో ఉన్న టాలెంట్‌ను ఎవరూ గుర్తించనక్కర్లేద్దు.. వారే గుర్తించి.. అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు.. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా యువత ఇదే చేస్తున్నారు. వారి నైపుణ్యాలను వివిధ రకాలుగా ప్రదర్శిస్తున్నారు. కొందరు వీడియో లు తీసి సోషల్‌మీడియా ద్వారా తమ ప్రతిభను ప్రపంచానికి తెలియజేస్తున్నారు. ఇటీవల కాకినాడకు చెందిన అమ్మాయి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టుల ద్వారా పాపులరై కోర్టు సినిమాలో హీరోయిన్ క్యారెక్టర్ కొట్టేసింది. కోనసీమ జిల్లా సరిహద్దులోని ఆచంట మండలం నక్కిడిలంక యువకుడు రాజ్‌కుమార్.. పరిసరాల్లో దొరికే వస్తువులతో వింతవాహనాలు తయారుచేస్తూ ఆ వీడియోలను యూట్యూబ్‌లో ఔరాఅనిపిస్తున్నాడు.



- పల్లెటూరులో కొత్త..కొత్తగా..షికారు!
- విభిన్న ఆకారాల్లో వాహనాల రూపకల్పన
- చేసింది డిప్లమో అయినా వినూత్నంగా ఆలోచన
- వీక్షకులను ఆకట్టుకుంటున్న నక్కిడిలంక యువకుడు
- 'కోనసీమ సరదాలు' పేరుతో యూట్యూబ్ ఛానల్

గల్ఫ్ వెళ్లొచ్చి..

కోనసీమజిల్లా సరిహద్దు ప్రాంతానికి చెందిన ఆచంట మండలం గోదావరి మధ్యలోని గ్రామం నక్కిడిలంక.. అక్కడ ఒక గ్రామం ఉందని బయట ప్రపంచానికి తెలియడం చాలా అరుదు.. ఎందుకంటే లంక గ్రామం కావడంతో పరిసర గ్రామాల వారికే అవగాహన ఉంటుంది.ఆ గ్రామానికి చెందిన యువకుడు రాజ్‌కుమార్ వినూత్న వాహనాల రూపకల్పన చేసి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. అమలాపురం బీవీసీ కళాశాలలో డిప్లమో పూర్తి చేసి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి పోయాడు. తిరిగి వచ్చిన తర్వాత తనకు ఉన్న నైపుణ్యంతో వినూత్న వాహనాలను తయారు చేసి యూట్యూబ్ ద్వారా ప్రపంచానికి చూపించాలన్న ఆలోచనతో ఇటీవలే 'కోనసీమ సరదాలు' పేరుతో ఛానల్ ప్రారంభించాడు. సాంకేతిక పరమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని తనకు ఉన్న పరిజ్ఞానంతో తన ప్రయత్నాన్ని సఫలం చేసుకుంటున్నాడు.



యువకుడు తయారు చేసిన వెదురుబొంగుల పడవ

కొత్తకొత్తగా ఇలా..

తన స్నేహితుడు మనోజ్ సాయంతో రాజ్‌కుమార్ ఇప్పటి వరకు నాలుగు వినూత్న వాహనాలు తయారు చేశాడు. ఎదురుబొంగులు, ప్లాస్టిక్ కవర్ల సాయంతో పడవను తయారు చేసి వశిష్ట నదీ పాయలో విహారం చేశాడు. ఒక సైకిల్‌పై మరో సైకిల్‌ను జోడించి వాటి మధ్య వెల్డింగ్‌తో ఎత్తయిన సైకిల్‌గా రూపకల్పన చేసి గ్రామంలోని రోడ్లపై తొక్కాడు. ఒకేసారి ఐదుగురు ప్రయాణం చేసేలా పొడవాటి స్కూటీని తయారు చేసి సీసీ రోడ్లపై ప్రయాణం చేశాడు. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి స్కూటీ సాయంతో బగ్గి వాహనం(చిన్నకారు) తయారు చేసి రోడ్డుపైకి వచ్చాడు. వాహనాల తయారీలో వెల్డింగ్ దగ్గర నుంచి బిగించే వరకు అన్నీ అతడే స్వయంగా చేసుకోవడం విశేషం. ఒక్కసారి చేసిన వాహ నాన్ని తన యూట్యూబ్ కోసం వీడియో చేసిన తర్వాత నిర్వీర్యం చేస్తాడు.ఆ వస్తువులనే మళ్లీ నూతన వాహనం తయారీకి వినియోగిస్తాడు. ఇలా అద్భుతంగా తీర్చిదిద్దుతాడు. వాహనాలపై పల్లె రోడ్లపై తిరుగుతూ రీల్స్ చేసి వాహ్‌వా అనిపించుకుంటున్నాడు.

పనిలోనే ఆనందం వెతుక్కుంటున్నా : రాజ్‌కుమార్

నాకు చిన్నతనం నుంచి వాహనాలంటే చాలా ఇష్టం.. ఎక్కడైనా కొత్త వాహనాలు కనిపిస్తే తరచి తరచి చూడడం అలవాటు..చిరంజీవి పాత సినిమాల్లో చూస్తే చాలా వాహనాలు కనిపించేవి.. వాటిని మైండ్‌లో పెట్టుకునేవాడిని..ప్రస్తుతం నా వాహనాలకు అదే ప్రేరణ.. పాత వాహనం తీసుకుని దాన్ని రీమోడల్ చేస్తా. డిప్లమో అయిన తర్వాత ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లిపోయా. అక్కడ పనిచేసేవాడినే కానీ ఏదో తెలియని వెలితి.. ఎందుకొచ్చిన గొడవ అని వచ్చేశా.. నా టాలెంట్‌నే పెట్టుబడిగా పెట్టి వాహనాలు తయారుచేస్తున్నా.. ఆనందంగా ఉంది.





ఇది లోకల్ మేడ్ వాహనం.. ఎలా ఉందో చూశారా.. ఐరన్ బద్దలు.. యాక్టివా ఇంజన్.. టైర్లు అమర్చి ఐదుగురు ప్రయాణించేలా వాహనం ఇలా..





కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో యువతీయువకుల సాధన

శారీరక బలం, చురుకుదనం, నైపుణ్యంతో

మీరే మేటి అథ్లెట్



ఏ దేశానికైనా యువతే ప్రధాన వనరు. అలాంటి యువత ఆరోగ్యం, ఆలోచనా విధానాన్ని తీర్చిదిద్దేదే క్రీడ. ఏ క్రీడలోనైనా ప్రావీణ్యం సాధించడానికి మౌలికంగా అవసరమయ్యే శక్తి, సామర్థ్యాలకు పర్యావరణ పరిరక్షణ తోడైతే ఆ దేశ ఖ్యాతి ఇనుమడిస్తుంది. పురాతన ఒలింపిక్ క్రీడల్లో అగ్ర భాగం జంప్, జావెలిన్, డిస్కస్‌త్రో పాటు పరుగుదే. బాక్సింగ్, రథాల పోటీలతో పాటు మల్లయుద్ధం ఉండేవి. ప్రపంచ క్రీడా వేదికైన ఆధునిక ఒలింపిక్స్‌లో పతకం సాధించడం ప్రతి క్రీడాకారుడి కల. ఒలింపిక్స్‌లో సైతం అత్యధిక పతకాలు (48 బంగారు) అథ్లెటిక్స్‌లోనే అందిస్తారు.

నేడు ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం

కార్పొరేషన్ (కాకినాడ), మే 6 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడ మొదలైందే అథ్లెట్‌గా అంటే అతిశయోక్తి కాదు. మానవ పరిణామక్రమంలో మనిషి రెండు కాళ్లతో నడవడం ప్రారంభించాడు. మెరుగైన జీవనం కోసం పరుగెత్తాడు. ఆహార అన్వేషణలో భాగంగా విసిరాడు.. దుమికాడు. ఇవన్నీ మనిషి జీవన గమనాన్ని ఊహించలేని స్థితికి చేర్చాయి. నడవడం, పరుగెత్తడం, దుమకడం, విసరడం అనేవి అథ్లెటిక్ ట్రాక్, ఫీల్డ్ అంశాలైనా.. ప్రతి క్రీడలోనూ ప్రాథమిక అంశాలు. క్రీడాకారుడి (అథ్లెట్)గా ఎదిగేందుకు శిక్షణలో శారీరక బలం, చురుకుదనం, నైపుణ్యం ప్రధాన పాత్ర పోషిస్తాయి. అలాంటి అథ్లెట్‌గా పిల్లలు, యువతలో ఫిట్‌నెస్ ప్రాముఖ్యం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి ప్రతిఏటా మే 7న ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం జరుపుకుంటున్నాము. 1996లో తొలిసారిగా ప్రపంచ అథ్లెటిక్స్ డేను అంతర్జాతీయ అథ్లెటిక్ అమెచ్యూర్ సమాఖ్య ప్రారంభించింది.

క్రీడలు మానసిక స్థితి, ఏకాగ్రత, నిద్ర అలవాట్లను మెరుగుపరుస్తుంది. ఒత్తిడి, నిరాశను తగ్గిస్తుంది. ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి సహాయపడుతుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఇది నాయకత్వ లక్షణాలతో ముడిపడి ఉంది. వృద్ధులకు మానసిక ప్రయోజనాలను కూడా కలిగిస్తుంది.

1985 ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పీటీ ఉష ఐదు బంగారు పతకాలు సాధించింది. కామన్‌వెల్త్ క్రీడల్లో మిల్కాసింగ్ స్వతంత్ర భారతదేశానికి మొట్టమొదటి స్వర్ణ పతకం సాధించాడు. సియోల్ ఆసియా క్రీడల్లో పీటీ ఉష ఒక రజతం, నాలుగు బంగారు పతకాలను గెలుచుకుంది. 2018 ప్రపంచ యు-20 చాంపియన్‌షిప్‌లో హిమాదాస్ స్వర్ణం గెలుచుకున్నారు. యూనివర్సియేట్‌లో స్వర్ణం గెలిచిన తొలి భారతీయురాలిగా ద్యుతీచంద్ నిలిచారు.



ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం లక్ష్యాలు

- యువతలో క్రీడలను ప్రాచుర్యం పొందడం. అథ్లెటిక్స్‌కు ప్రోత్సాహం ఇవ్వడం.
- పాఠశాలలు, సంస్థల్లో దానిని ప్రాథమిక క్రీడగా మార్చడం.
- క్రీడల గురించి ప్రజల్లో అవగాహన పెంచడం, క్రీడల ప్రాముఖ్యత, యువతకు విద్యను అందించడం.
- యువత, క్రీడ, పర్యావరణ పరిరక్షణ మధ్య ఒక ముఖ్యమైన సంబంధాన్ని ఏర్పరచడం.



అథ్లెటిక్స్‌కి మంచి రోజులు వచ్చాయి



మన దేశంలో అథ్లెటిక్స్‌కి మంచి రోజులు వచ్చాయి. నేను 1994 నుంచి 1997 వరకు జూనియర్ ఇండియా టీమ్ కోచ్‌గా పని చేశాను. అప్పటికి, ఇప్పటికి చూస్తే సింథటిక్ ట్రాక్‌లు చాలా వచ్చాయి. మంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వుంది. కానీ కోచ్‌లు చాలా తక్కువ వున్నారు. 1990లో ప్రతి జిల్లాకి ఒక కోచ్ ఉండేవారు. ఎస్ఏఐ కోచ్‌లు ఉండేవారు. అప్పట్లో అథ్లెటిక్స్ ప్రాక్టీస్ చేసేవారు ఎక్కువ. ప్రస్తుత ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. పూర్వం తరహాలో స్పోర్ట్స్ హాస్టల్స్ అకాడమీలు రానున్నాయి. రాష్ట్రంలో సింథటిక్ ట్రాక్‌ల సంఖ్య పెరగనుంది. కాకినాడ జేఎన్టీయూలో సింథటిక్ ట్రాక్ రెడీ అవుతోంది. జిల్లా క్రీడా మైదానంలో కూడా ట్రాక్‌కి ప్రతిపాదనలను కలెక్టర్ అప్రూవల్‌తో ఖేలో ఇండియా స్కీమ్ కింద పం పించాము. బేసిక్ లెవెల్లో క్రీడాకారులు అథ్లె టిక్స్‌లో చేరితే ఏగేమ్‌లోనైనా రాణించగలరు. హ్యాపీ వరల్డ్ అథ్లెటిక్స్ డే.

బి.శ్రీనివాసకుమార్, డీఎస్‌డీవో, కాకినాడ

ఏ ఆటకైనా ఫిట్‌నెస్ ముఖ్యం



ఏ ఆట ఆడాలన్నా ముందుగా ఫిట్నెస్ అవసరం. అది అథ్లెటిక్స్ ద్వారానే వస్తుంది. 1999 నుంచి 2004 వరకు రన్నింగ్‌లో సీనియర్ నేషనల్ బ్రాంజ్ మెడల్, 400 మీటర్ల అడల్ట్స్‌లో నేషనల్ రికార్డ్, ఏషియన్ గ్రాండ్‌ప్రిక్స్‌లో బ్రాంజ్ మెడల్, ఆఫ్రో ఏసియన్ గేమ్స్‌లో నాలుగో స్థానం, వరల్డ్ గేమ్స్, సౌత్ ఏషియన్ గేమ్స్.. ఇలా ఎన్నో పతకాలు సాధించాను. 2006 కోల్‌కతాలో కోచింగ్ డిప్లొమా, ఆర్మీ టీమ్‌కి, సర్వీస్ టీమ్‌కి కోచ్‌గా వ్యవహరించాను. 2011 నుంచి 2013 వరకు ఇండియా అథ్లెటిక్స్ టీమ్ అడల్ట్స్, హైజామ్‌కి కోచ్‌గా పని చేశాను. 2017లో వైఎస్సార్ కడప జిల్లా స్పోర్ట్స్ స్కూల్స్‌కి స్పోర్ట్స్ ఆఫీసర్‌గాను, 2018లో నాగార్జున యూనివర్సిటీలో చీఫ్ కోచ్‌గాను విధులు నిర్వర్తించాను. 2019 నుంచి 2023 వరకు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో అథ్లెటిక్స్ కోచ్‌గా పని చేశాను.

పైడి వరప్రసాద్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్, జడ్డంగి హైస్కూలు



నేటి బాలలే.. రేపటి అథ్లెట్లు

కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో చిన్నారుల సాధన

ఏపీ ఈఏపీసెట్ దరఖాస్తులో తప్పుల సవరణకు

రేపటి వరకు గడువు

- మార్పు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో అవకాశం
- మొత్తం 3,60,702 దరఖాస్తులు
- ఈనెల 12 నుంచి హాల్‌టికెట్‌ల డౌన్‌లోడ్
- 19 నుంచి 27 వరకూ ఆన్‌లైన్ విధానంలో పరీక్షల నిర్వహణ
- ఏపీ ఈఏపీసెట్ ఛైర్మన్, ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్



జేఎన్టీయూకే, మే 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీసెట్-2025 దరఖాస్తులో ఏమైనా తప్పులుంటే ఈ నెల 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో మార్పు చేసుకునేందుకు గడువు ఉందని సెట్ ఛైర్మన్, జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఏపీఎస్సీహెచ్ఈ నేతృత్వంలో కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో జరిగే ఏపీ ఈఏపీసెట్‌కు ఇప్పటివరకూ 3,60,702 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రూ.2000 అపరాధ రుసుముతో మే 7వరకూ రూ.4000తో 12వ తేదీ వరకు, రూ.10,000 అపరాధ రుసుముతో 16వ తేదీ వరకూ https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 19 నుంచి 27 వరకూ ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్షలకు ఏపీలో 46, తెలంగాణాలోని హైదరాబాద్‌లో 2 ప్రాంతీయ కేంద్రాలు మొత్తం 48 ప్రాంతీయ కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు జరుగుతాయని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. దరఖాస్తులో విద్యార్థులు ఏదైనా సమాచారాన్ని తప్పుగా పూరించినట్లయితే వారు ఈఏపీ సెట్ సహాయకేంద్రాన్ని సంప్రదిస్తే కేటగిరి-1కు సంబంధించిన విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, సంతకం, ఫొటో, ఇంటర్ హాల్‌టికెట్ నెంబర్, విభాగం, కమ్యూనిటీ వివరాలను సవరించనున్నట్టు చెప్పారు. అలాగే కేటగిరి-2కు సంబంధించి ఇంటర్ పూర్తిచేసిన సంవత్సరం, మాధ్యమం, విద్యా వివరాలు, బ్రిడ్జి కోర్సు హాల్ టికెట్ నెంబరు, తల్లి పేరు, జెండర్, ఆధార్, రేషన్ కార్డు వివరాలు, మైనార్టీ, నాన్‌మైనార్టీ వివరాలు, స్థానికత వివరాల్లో తప్పులుంటే ఈ నెల 8వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో మార్పు చేసుకునేందుకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను ఈనెల 12నుంచి ఏపీఈఏపీసెట్ వెబ్‌సైట్‌తోపాటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 0884 235 9599, 234 2499 నెంబర్లలో కానీ, helpdeskapeapcet@apsche.org అనే మెయిల్ ఐడీ ద్వారా కానీ సంప్రదించవచ్చని కన్వీనర్ వీవీ సుబ్బారావు సూచించారు.

స్మార్ట్ బ్రిడ్జ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్‌తో

జేఎన్టీయూకే ఎంవోయూ



ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న యూనివర్సిటీ, కంపెనీ ప్రతినిధులు

జేఎన్టీయూకే, మే 6 (ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని వీసీ సమావేశ హాల్లో హైదరాబాద్‌లోని స్మార్ట్ బ్రిడ్జ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, కాకినాడ జేఎన్టీయూకే మధ్య అవగాహనా ఒప్పందం(ఎంవోయూ) కుదిరినట్టు ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఐఐఐపీటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీటీ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ ఈ ఎంవోయూ ద్వారా వర్సిటీ విద్యార్థులకు అనుభవపూర్వక ప్రాజెక్టు ఆధారిత అభ్యసన మరింత సులభతరమవుతుందన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు, అధ్యాపకులకు వర్చువల్ ఇంటర్న్‌షిప్స్, హ్యాకథాన్స్, ఎఫ్‌డీపీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం స్మార్ట్ బ్రిడ్జ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ఉపాధ్యక్షురాలు ఎస్.శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థి కేంద్రీకృత విధానం, నూతన ఆవిష్కరణలు, విలువలతో కూడిన శిక్షణను తమ సంస్థ ద్వారా విద్యార్థులకు అందిస్తామన్నారు. వీసీ సమక్షంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, స్మార్ట్ బ్రిడ్జ్ ఉపాధ్యక్షురాలు శ్రీదేవి సంతకాలు చేసిన ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, మాజీ వీసీ మురళీకృష్ణ, డైరెక్టర్లు ప్రొఫెసర్ బి.బాలకృష్ణ, ప్రొఫెసర్ జి.పద్మజారాణి, ప్రొఫెసర్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, స్వర్ణకుమారి, చక్రవర్తి పాల్గొన్నారు.

11న బాస్కెట్‌బాల్ అండర్-23 జట్ల ఎంపికలు

పిఠాపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పురుషులు, మహిళలు (అండర్-23) బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక, చాంపియన్‌షిప్ పోటీలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు ఉన్నత పాఠశాలలో ఈ నెల 11వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు (అయలు) తెలిపారు. క్రీడాకారులు 2002 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. ఒక పట్టణం నుంచి ఒక టీమ్‌ను మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు ఆధార్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలను ఒరిజినల్ తీసుకురావాలని సూచించారు.

వరదలను సమర్ధవంతంగా ఎదుర్కొందాం



డీఈలు, ఏఈలతో మాట్లాడుతున్న ఎస్ఈ గోపీనాథ్

- ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ గోపీనాథ్
- డీఈలు, ఏఈల నుంచి క్షేత్రస్థాయి సమాచారాన్ని తెలుసుకున్న ఉన్నతాధికారి

ధవళేశ్వరం, మే 6 (ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి అందరూ సంసిద్ధంగా ఉండాలని ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ కె.గోపీనాథ్ కోరారు. మంగళవారం ఉదయం తమ కార్యాలయంలో ఈఈలు, డీఈలు, ఏఈలతో వరద నివారణ సమాయత్త సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు, ఏటిగట్ల పటిష్టత, ఔట్‌ఫాల్ స్లూయిస్‌ల పరిస్థితి తదితర వివరాలు, వాటి నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో గోదావరి వరదల వల్ల బలహీనపడిన ఏటిగట్లు, వాటి పటిష్టతకు తీసుకున్న చర్యలు, ప్రస్తుతం ముందస్తుగా తీసుకోవాల్సిన పనుల వివరాలను అడిగారు. వరద నివారణ చర్యలు చేపట్టడానికి ఫ్లడ్ స్టోర్స్‌లో ఉన్న ఫ్లడ్ మెటీరియల్ వివరాలతో పాటు కావాల్సిన ఫ్లడ్ మెటీరియల్ వివరాలు అందజేయాలన్నారు. ఫ్లడ్ బ్యాంకులపై కాలువ గట్లపై చెత్తను డంప్ చేస్తున్న గ్రామ పంచాయతీలకు నోటీసులు పంపించాలని ఆదేశించారు.అధికారులు క్షేత్ర స్థాయిలో ఫ్లడ్ బ్యాంక్‌లను, ఔట్‌ఫాల్ స్లూయిస్‌ల పరిస్థితిని పరిశీలించాలని ఇసుక ర్యాంపుల కోసం కొన్ని చోట్ల ఫ్లడ్ బ్యాంక్‌లను ఛిద్రం చేస్తున్నారని వాటిని గుర్తించి చర్యలు తీ సుకోవాలని సూచించారు. వరదలను ఎదుర్కోవడానికి ఫ్లడ్ డ్యూటీ అధికారులు అందరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. సమావేశంలో హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, డిప్యూటీ ఎస్ఈ జి.కనకేష్, తూర్పు డెల్టా ఈఈ వి.రామకృష్ణ, మధ్య డెల్టా ఈఈ బి.శ్రీనివాసరావు, డ్రైనేజీ డివిజన్ ఈఈ కిషోర్, వశిష్ట సబ్ డివిజన్ డీఈ జి.శ్రీనివాస్, హెడ్‌వర్క్స్ సబ్ డివిజన్ డీఈ ఆనందబాబు, గౌతమి సబ్ డివిజన్ డీఈ సుబ్బారావు, ఏఈలు విశ్వనాథరాజు, ఎ.సాయిరాం, సునీల్, రాధాకృష్ణ, ప్రసాద్, మణికంఠ, ఎ.శివ తదితరులు పాల్గొన్నారు.

సన్నద్ధంగా ఉన్నాం

గోదావరి వరదలను ఎదుర్కోవడానికి సన్నద్ధంగా ఉన్నామని ఎస్ఈ కె.గోపీనాథ్ తెలిపారు. 20లక్షల క్యూసెక్కులకు పైబడి వరద వచ్చినా తట్టుకునే విధంగా ఫ్లడ్ బ్యాంక్స్ పటిష్టంగా ఉన్నాయన్నారు. కాటన్ బ్యారేజ్ గేట్లకు మరమ్మతులు చేపట్టడానికి రూ.15 లక్షలతో అంచనాలు రూపొందించామని, అనుమతి లభించిన వెంటనే పనులు చేపడతామని తెలిపారు. కూళ్ల, సుందరపల్లి, కుండలేశ్వరం తదితర ప్రాంతాల్లో బలహీన ఫ్లడ్ బ్యాంక్‌లను తాత్కాలికంగా పటిష్టం చేస్తామని తాజా, ఈస్ట్ కొక్కిలేరు, కడలి తదితర ప్రాంతాల్లో కొత్త ఔట్‌ఫాల్స్ స్లూయిస్‌ల నిర్మాణానికి రూ.9.4 కోట్లతో రూపొందించిన అంచనాలకు ఆమోదం లభించిందని,వరదల అనంతరం పనులు చేపడతామని పేర్కొన్నారు. ఫ్లడ్ స్టోర్‌లలో అవసరమైన ఫ్లడ్ మెటీరియల్ కోసం టెండర్లు పిలుస్తామని తెలిపారు. కాల్వ గట్లు వెంబడి ఫ్లడ్ బ్యాంక్‌లపై చెత్తను వేస్తున్న గ్రామ పంచాయతీలకు నోటీసులు జారీ చేసే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని ఎస్ఈ గోపీనాథ్ చెప్పారు.

పాపికొండల యాత్రకు గ్రీన్ సిగ్నల్

దేవీపట్నం, మే 6(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల విరామం అనంతరం పాపికొండల విహారయాత్ర పర్యాటక బోట్లకు అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఆదివారం ఉదయం మండలంలో ఈదురుగాలులు భారీ వర్షం కురవడంతో పాపికొండలు వెళ్లే బోట్లను అధికారులు నిలిపివేశారు. దీంతో మూడు రోజులు పాటు విహార యాత్ర నిలిచిపోయింది. వాతావరణం అనుకూలంగా ఉండడంతో బుధవారం నుంచి యాత్రకు వెళ్లేందుకు పర్యాటకుల బోట్లకు అధికారులు అనుమతులిచ్చారు. బుధవారం సుమారు 70 మంది పర్యాటకులు ఆన్‌లైన్‌లో టిక్కెట్లను బుక్ చేసినట్టు తెలిసింది.





యానాం నుంచి నీలపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో మోడుబారి అటుపై పచ్చదనంతో నిండిన రావిచెట్టు

నాడు రాలే.. నేడు హాయిలే..

వసంతమాసం వచ్చిందంటే చెట్లు మోడుబారుతాయి. మళ్లీ కొత్తగా చిగురిస్తాయి. సామర్లకోట, యానాం రహదారుల్లో భారీ వృక్షాలు మోడుబారి రోజుల వ్యవధిలో పచ్చదనం సంతరించుకున్న దృశ్యాలను ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించిందిలా.





సామర్లకోట ప్రభుత్వ పశువైద్యశాల ఆవరణలో భారీ చెట్టు దృశ్యాలు

మొక్కు తీర్చుకునేందుకు వెళ్లి మృత్యువాత

గోదావరిలో స్నానానికి దిగి ఇద్దరు యువకుల మృతి

కపిలేశ్వరపురం మండలం వీధివారిలంకలో సంఘటన

కపిలేశ్వరపురం/మండపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక శివారు వీధివారిలంకలో మంగళవారం స్నానానికి దిగి ఇద్దరు యువకులు మృతిచెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం మండపేట మార్కెట్‌కు సెలవు కావడంతో పట్టణానికి చెందిన దాసరి సాయిరామ్ (27), మెండెం రాంబాబు(35), వనుం గోవిందు, బెజవాడ శ్రీనివాస్‌లు వీధివారిలంకలోని ధనమ్మ మర్రి వద్ద మొక్కు చెల్లించుకునేందుకు వెళ్లారు. మొక్కు తీర్చుకుని భోజనాలు చేసిన అనంతరం చెంతనే ఉన్న గోదావరిలో దిగి స్నానానికి దిగి రాంబాబు, సాయిరామ్‌లు గోదావరిలో గల్లంతయ్యారు. దీంతో మండపేట రూరల్ సీఐ పెద్దిరాజు, అంగర ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా సాయిరామ్, రాంబాబు మృతదేహాలు లభ్యమయ్యాయి. వీఆర్వో వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ రవికుమార్ పేర్కొన్నారు.



రాంబాబు మృతదేహం, ఫైల్‌ఫొటో



సాయిరామ్ మృతదేహం, ఫైల్‌ఫొటో

మండపేటలో విషాదచాయలు

ఇద్దరు మృతితో మండపేటలో విషాదచాయలు అలుముకున్నాయి. పార్థసారథినగర్‌కు రాంబాబుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రాంబాబు తండ్రి పొగాకు వ్యాపారం చేస్తుంటాడు. సాయిరామ్ ఆంధ్రా బ్యాంకు వీధిలోని ప్రైవేటు చార్టెడ్ అకౌంటెంట్ వద్ద పనిచేస్తున్నాడు. అతడు అవివాహితుడు, తండ్రి కేపీరోడ్డులో బియ్యం వ్యాపారం చేస్తుంటాడు. మొక్కు తీర్చుకునేందుకు వెళ్లి మృత్యువాతపడడంతో ఇద్దరి కుటుంబ సభ్యులు తీవ్రంగా రోదిస్తున్నారు.

నేటి నుంచే సత్యదేవుని దివ్యకల్యాణోత్సవాలు

- తొలిరోజు పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా అలంకరణ
- శరవేగంగా ఏర్పాట్లు
- పరిశీలించిన కాకినాడ జిల్లా ఎస్పీ



సత్యదేవుని దివ్యకల్యాణం కోసం కొబ్బరి బొండాలతో అలంకరణ

అన్నవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే భక్తవరదాయుడు అన్నవరం సత్యదేవుడు వరుడవుతున్న వేళ రత్నసత్యగిరులు పులకించిపోతున్నాయి. శ్రీవిశ్వావసు నామ సంవత్సర వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. తొలిరోజు సాయంత్రం 4 గంటలకు అనివేటి మండపంలో సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను పండితులు పెళ్లికొడుకు, పెళ్లికూతురుగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అనివేటి మండపం వద్ద ప్రత్యేక అలంకరణలు చేపడుతున్నారు. మంగళవారం సాయంత్రం కల్యాణవేదికను కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు పరిశీలించారు. ప్రముఖులు, సామాన్యుల గ్యాలరీలను పరిశీలించి సూచనలు చేశారు. భక్తులు ఎక్కువగా వస్తుండడంతో ఎటువంటి దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు అదనపు సీసీ కెమెరాలతో నిఘా పెంచినట్టు డీఎస్పీ తెలిపారు. సుమారు 100 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నారు. ప్రముఖుల వాహనాలు, ఫైర్ ఇంజన్, అంబులెన్స్‌లు మాత్రమే తూర్పురాజగోపురం పార్కింగ్ వద్ద నిలపనున్నారు. భారీవాహనాలను కొండదిగువన కళాశాల మైదానంలో ఉంచి దేవస్థానం, ప్రయివేట్ బస్సుల్లో భక్తులను కొండపైకి తీసుకెళ్లనున్నట్టు ఈవో వివరించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామ్మోహనరావు, ఏఈవోలు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. కోనసీమ జిల్లా మండపేటకు చెందిన ఒక భక్తుడు ప్రత్యేక అలంకరణతో తయారుచేయించిన కొబ్బరిబొండాలను స్వామివారి కల్యాణానికి వినియోగించాలని కోరారు. దివ్యకల్యాణం సందర్భంగా దేవస్థానం కొండపై, కొండదిగువన ఏర్పాటుచేసిన విద్యుద్దీపఅలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



విద్యుత్ కాంతుల్లో ఆలయం

ఐపీఎస్ అధికారుల పూజలు

సత్యదేవుని సన్నిధిలో మంగళవారం రాత్రి ఐపీఎస్ అధికారులు డైరెక్టర్ జనరల్ అంజనీకుమార్, జైళ్లశాఖ డీఐజీ రవికిరణ్, కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా మంగళవారం ప్రత్యేకపూజలు జరిగాయి.

కుమార్తెను బస్సు ఎక్కించడానికి వెళ్తూ..

ఆర్టీసీ బస్సు ఢీకొని ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మృతి



మృతిచెందిన బత్తిన వెంకటరమణ

ధవళేశ్వరం, మే 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందాడు. మంగళవారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం ప్రధాన రహదారిపై జరిగిన ఈ దుర్ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. సీతానగరం మండలం బొబ్బిల్లంక గ్రామానికి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ హెడ్‌కానిస్టేబుల్ బత్తిన వెంకటరమణ(56) కుటుంబంతో కొంతమూరులో ఉంటూ రాజమహేంద్రవరంలో విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం తనకు కేటాయించిన విధులు నిర్వర్తించడానికి వేమగిరి పయనమయ్యాడు. తన కుమార్తెను బ్యారేజి సెంటర్ వద్ద బస్సు ఎక్కించడానికి ద్విచక్రవాహనంపై తీసుకెళ్తూ ధవళేశ్వరం సినిమా థియేటర్ సెంటర్ సమీపంలోకి వస్తుండగా రాజోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాజమహేంద్రవరం నుంచి వస్తూ సైడ్ నుంచి ఢీకొనడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి వెంకటరమణ బస్సు కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. కుమార్తెకు గాయాలు కాలేదు. ప్రమాద సమాచారం అందుకున్న ధవళేశ్వరం సీఐ గణేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటరమణ కుటుంబ సభ్యులను ఎస్పీ నరసింహకిశోర్ పరామర్శించి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వెంకటరమణ భౌతికకాయం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తూర్పుగోదావరి ఎస్పీ

వక్ఫ్‌చట్ట సవరణను నిరసిస్తూ

ముస్లింల భారీ ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ, మే 6(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టాన్ని సవరిస్తూ ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తూర్పుగోదావరి జిల్లారాజమహేంద్రవరంలో ముస్లింలు భారీ ర్యాలీ చేశారు. రాజమండ్రి ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో జాంపేట మసీదు -ఆజాద్ చౌక్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన భారీ ర్యాలీలో వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఛైర్మన్ మహ్మద్ ఆరీఫ్ మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లు ముమ్మాటికి రాజ్యాంగ ఉల్లంఘనేనని అన్నారు. భారతదేశంలో సుమారు 22కోట్ల మంది ముస్లింల ఆస్తిత్వాన్ని అస్థిరపరిచేవిధంగా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వక్ఫ్‌చట్టాన్ని కేంద్రం ఆమోదించడం దారుణమన్నారు. ముస్లిం ఆస్తులను కాజేసే కుట్రలో భాగంగానే ఈ చట్టసవరణ చేశారని, ఇది భారత రాజ్యాంగానికి చీకటి రోజు అని అన్నారు. ముస్లింల ఆస్తులను ప్రభుత్వాలు తమ ఆధీనంలోకి తీసుకుని వారిని అణచివేయాలనుకోవడం ముస్లిం సమాజాన్ని భయపెట్టడమేనన్నారు. ర్యాలీలో హబీబుల్లాఖాన్, అహ్మద్ అన్సర్, కలిముల్లాఖాన్, అస్సర్, ముక్తియార్, బ్యూటీ షరీఫ్, డిల్లు, అసదుల్లా అహ్మద్, సల్మాన్,బాబులు రబ్బాని పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

కారు కింద పడి ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయాలపాలైన ఓ వ్యక్తి

నల్లజర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం కన్నపురానికి చెందిన భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డిలకు తీవ్రగాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డి బైక్‌పై కన్నపురం నుంచి తాడేపల్లిగూడెం వెళ్తుండగా ప్రకాశరావుపాలెం శివారులో కారును అధిగమించే ప్రయత్నంలో అదే కారు కింద పడి తీవ్ర గాయాలయ్యారు. 108లో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఏ కేసు నమోదు కాలేదని ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

నిర్విరామంగా విద్యుదుత్పత్తి

ఏప్రిల్ 1 నుంచి మే 5 వరకు విద్యుదుత్పత్తి వివరాలు

ప్రాజెక్టు	సామర్థ్యం మెగావాట్లు	ఉత్పత్తి మిలియన్ యూనిట్లు
మాచ్‌ఖండ్	120	45.12
సీలేరు	240	57.85
డొంకరాయి	25	14.97
పొల్లూరు	460	121.98



పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న యూనిట్లు

మోతుగూడెం, మే 6 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్ పరిధిలో ఉన్న జలవిద్యుత్ కేంద్రాల్లో నిర్విరామంగా విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ఒక్క మాచ్‌ఖండ్ మినహా అన్ని కేంద్రాల్లో యూనిట్లు అందుబాటులో ఉండటంతో ఉత్పత్తి నిరంతరంగా జరుగుతోంది. ఉన్న నీటి నిల్వలను సద్వినియోగం చేసుకుంటున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ కాంప్లెక్స్ పరిధిలోని నాలుగు జల విద్యుత్తు కేంద్రాల్లో మాచ్‌ఖండ్ మినహా అన్ని లక్ష్యాన్ని పూర్తి చేశాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మాచ్‌ఖండ్‌తో సహా అన్ని చోట్ల లక్ష్యసాధన దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతేడాది మాచ్‌ఖండ్‌లో నాలుగో యూనిట్ షాఫ్ట్‌షీట్ నుంచి నీరు లీకేజీ అవుతుండటంతో విద్యుదుత్పత్తి నిలిపివేశారు. గత నెలలో అరకు లైన్‌ట్రిప్ అవుతుండడంతో మొదటి యూనిట్ నుంచి ఉత్పత్తి ఆపేశారు. ఈ 2 యూనిట్లను వినియోగంలోకి తీసుకురావడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. సీలేరు, పొల్లూరు, డొంకరాయి, మాచ్‌ఖండ్‌లో ప్రస్తుతం రోజుకు 4 నుంచి 5 మిలియన్ యూనిట్లు విద్యుదుత్పత్తి జరుగుతోంది.

ఇంటిపై పిడుగుపడి మహిళకు గాయాలు

తాళ్లపూడి, మే 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలో ఇటీవల కురిసిన వర్షానికి ఓ ఇంటిపై పిడుగుపడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని బొర్రా వీరలక్ష్మి ఇంటిపై పిడుగుపడి ఇల్లు పాక్షికంగా దెబ్బతినడమేకాక ఆమె గాయాల పాలైంది. దీంతో రాజమహేంద్రవరంలోని ప్రవేటు ఆసుపత్రిలో చేర్చారు. అన్నదేవరపేట వీఆర్వో కాపూరి నాగేశ్వరరావు నివేదిక ప్రకారం ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు ఆసుపత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. వైద్యం నిమిత్తం రూ.8000 అందించినట్టు తెలిపారు.

రైలు ఢీ కొని మహిళ మృతి

తుని రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీ కొని మహిళ మృతిచెందిన సంఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నర్సీపట్నం 1 రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంలో పట్టాలు దాటుతుండగా సాలూరు సంతోషి (35) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనా స్థలానికి చేరుకున్న తుని రైల్వే పోలీసులు మృతురాలి వివరాలు సేకరించారు. విజయనగరం జిల్లా తోట వలస గ్రామానికి చెందిన మహిళగా గుర్తించినట్టు తెలిపారు. శవ పంచనామాలు అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామన్నారు.

ఒంగోలు ఆవు రికార్డు

ఒక్కరోజులో 21.19 లీటర్ల పాలు

మండపేట, మే 6(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పాడి రైతు వేగుళ్ల మురళీకృష్ణకు చెందిన ఒంగోలు జాతి ఆవు పాలు ఇవ్వడంతో రికార్డు నెలకొల్పింది. సాధారణంగా ఒంగోలు జాతి ఆవు పూటకు రెండున్నలీటర్ల నుంచి మూడు లీటర్లు ఇస్తుంది. రోజుకు 5లేదా 6లీటర్లు ఇవ్వటం పరిపాటి. అలాంటిది మురళీకృష్ణకు చెందిన 5ఏళ్ల ఆవు మంగళవారం ఉదయం 11.5 లీటర్లు, సాయంత్రం 9.6 లీటర్లు కలిపి ఒక్కరోజులో 21.19 లీటర్ల పాలు ఇచ్చి సరికొత్త రికార్డును సొంతం చేసుకుంది. కేంద్రీయ పశు నమోదు అధికారి డి.రాజేశ్వరరావు సమక్షంలో మురళీకృష్ణ పాలు తీయగా పాలు వివరాలను నమోదు చేసి కేంద్రీయ పశు నమోదు సెంటర్‌కు పంపించారు.



రికార్డు స్థాయిలో పాలు ఇచ్చిన ఆవు

ట్రావెల్ బ్యాగులో నగదు దొంగతనంపై కేసు

కొవ్వూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ట్రావెల్ బ్యాగులో నగదు దొంగతనంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరుకి చెందిన మద్దల లక్ష్మీసాయి రామజ్యోతి తన అత్తకు అనారోగ్యం కారణంగా ఈ నెల 5న రూ.1,70,000 నగదును బ్యాగ్‌లో సర్దుకుని సింగవరం నుంచి నిడదవోలు ఆసుపత్రికి వచ్చింది. ఆసుపత్రిలో అత్తకు చికిత్స చేయించి ఆటోలో సింగవరం పంపించిన అనంతరం బస్టాప్‌కి వచ్చి 20 నిమిషాలు వేచి ఉంది. అనంతరం తాడేపల్లిగూడెం నుంచి రాజమహేంద్రవరం వెళ్లే పల్లెవెలుగు బస్సు ఎక్కి కొవ్వూరు టోలిగేట్ వద్ద దిగింది. అక్కడి నుంచి తన తండ్రికి ఫోన్ చేయగా బండిపై టోల్‌ప్లాజా వద్దకు ఆయన వచ్చాడు. తండ్రితో పాటు లక్ష్మీసాయి రామజ్యోతి దొమ్మేరులోని తల్లి ఇంటికి వెళ్లింది. అక్కడ బ్యాగును తెరిచి చూడగా నగదు కనిపించకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ ప్రకాష్ తెలిపారు.

శాస్త్రీయ సలహా సంఘం సమావేశం

రాజమహేంద్రవరం రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని జాతీయ వాణిజ్య పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం కలవచర్ల వారి శాస్త్రీయ సలహా సంఘం సమావేశం మంగళవారం జరిగింది. జాతీయ వాణిజ్య పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషమాధవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రాంతీయ వరి పరిశోధన సంస్థ మార్టేరు అసోసియేట్ డైరెక్టర్ టి.శ్రీనివాస్, పి.ముత్తురామన్, హైదరాబాద్ భారత వరి ప్రధాన శాస్త్రవేత్త ఐసీఏఆర్ వీఎస్‌జీఆర్ నాయుడు, కేవీకే కలవచర్ల హెడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాంకేతిక నిపుణులు 2024-25లో చేపట్టిన కార్యక్రమాలు, 2025-26 సంవత్సరంలో చేపట్టబోయే కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేశారు. శేషమాధవ్ మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టు మేటర్ స్పెషలిస్టు జిల్లాలోని కేవీకే పరిధిలోని మండలాలకు చెందిన వ్యవసాయ, ఉద్యాన రంగాల సమాచారాన్ని బెంచ్ మార్కు సర్వేగా పరిగణించుకుని సహజ వనరుల ఉప లబ్ధి తదితర అంశాలపై మ్యాపింగ్ చేసుకుని అత్యంత అవశ్యకత అంశాలను గుర్తించి డాక్యుమెంట్ చేయాలని సూచించారు. నాయుడు మాట్లాడుతూ కేవీకే గతేడాదిలో చేపట్టిన వ్యవసాయ విభాగం కార్యక్రమాలను వివరించారు. ఉద్యానవన విభాగం జీవిఆర్ సత్యవేణి ఉద్యానవన విభాగం చేపట్టిన ప్రదర్శన, క్షేత్రస్థాయి పరిశీలన వివరించారు. సస్యరక్షణ విభాగం కార్యక్రమాలను రఘునందన్ చెప్పారు. పశు నిర్వహణను డాక్టర్ బి.నాగేశ్వర్‌రెడ్డి, మత్స్యశాఖను డాక్టర్ రవీంద్ర, హెగ్డే గృహ విజ్ఞాన కార్యక్రమాలను సంజయ్ వివరించారు. రైతుల ప్రయోజనార్థం లిల్లీతోటల్లో నులి పురుగు నివారణ సమగ్ర యాజమాన్యం, పసుపులో దుంప కుళ్లు సమగ్ర యాజమాన్యం అనే రెండు కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో ఏరువాక, రాజమండ్రి, కాకినాడ శాస్త్రవేత్తలు ఎంటీవీ చలపతిరావు, పి.లలితాకామేశ్వరి, డీవీఎస్ రాజు, శిరీష తదితరులు పాల్గొన్నారు



కరపత్రాలను విడుదల చేస్తున్న డైరెక్టర్ మాగంటి శేషమాధవ్, శాస్త్రవేత్తలు

చేనేత కార్మికుల జీవనోపాధి మెరుగుకు చర్యలు

ఉప్పాడ చేనేత కార్మికులతో ఆర్‌జీఎస్‌ఏ కోఆర్డినేటర్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ వినోద్

కొత్తపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ చేనేత జాంధానీ చీరల ఉత్పత్తి, తద్వారా చేనేత కార్మికుల జీవనోపాధి మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విజయవాడ నుంచి ఆర్‌జీఎస్‌ఏ (రాష్ట్రీయ గ్రామీణ స్వరాజ్య అభియాన్) కో ఆర్డినేటర్ వినోద్ మంగళవారం కాకినాడ జిల్లా ఉప్పాడ వీవర్స్ కాలనీలో చేనేత కార్మికులతో సమావేశమయ్యారు. రాష్ట్రీయ గ్రామీణ స్వరాజ్య అభియాన్‌లో ఉప్పాడ గ్రామం ఎంపికైందన్నారు. దేశ, విదేశాల్లో ఉప్పాడ చేనేత జాంధానీ చీరలకు మంచిగుర్తింపు ఉందని అటువంటి ఖరీదైన చీరలు తయారు చేసేందుకు అవసరమైన వసతులు, తద్వారా కార్మికుల జీవనప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం రూ.5కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టు రూపొందించినట్టు చెప్పారు. దానిలో భాగంగా చేనేత కార్మికులకు ఏ వసతులు కల్పించాలి, జాంధానీ చీరల తయారీకి సమకూర్చాల్సిన ముడిసరుకు తదితర విషయాలపై చర్చించారు. చేనేత చీరల తయారీకి అవసరమైన ముడిసరుకులను రాయితీపై అందచేయాలని చేనేత కార్మికుడు దైవం మహేష్ కోరాడు. చీరల తయారీకి పడుగు, హల్లులు చేసేందుకు విశాలమైన ప్రదేశం అవసరం ఉంటుందన్నారు. ఉప్పాడ సర్పంచ్ ఉమ్మిడి మేరీ జాన్, ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్డీ సత్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

వందేళ్ల వృక్షం.. బతికించుకుందాం!



రాజమహేంద్రవరంతో పాటు చుట్టు పక్కల భారీ వృక్షాలు కనుమరుగయ్యాయి. అభివృద్ధి పేరుతో రహదారులు విస్తరణలో వందలాది వృక్షాలను నరికేశారు. దీంతో నగర పరిసరాలు ఎండవేడిమికి మండిపోయి చల్లదనం కరువైంది. కొత్తగా మొక్కలు నాటి వాటిని వృక్షాలు చేయడానికి సమయంపడుతుంది. కానీ ఉన్నవాటిని నిలబెట్టుకుంటే నెలల వ్యవధిలో అవి పునర్జీవం పొంది చల్లటి నీడను బాటసారులకు ఇస్తాయి. ఇలాంటి చెట్లే రాజమహేంద్రవరంలో అక్కడక్కడ దర్శనమిస్తున్నాయి. లాలాచెరువు సెంటర్‌లో బస్టాండ్ వెనకాల ఒక భారీ వృక్షం నెలకొరిగింది. దీని వయస్సు సుమారు 100 ఏళ్లు. దానంత వయస్సు వరకు మనుషులు బతకకపోయిన అటువంటి వాటిని బతికించుకుంటే మరిన్ని వందల ఏళ్లు బతికి భవిష్యత్ తరాలకు ఆక్సిజన్‌ను అందిస్తుంది. సినిమా చెట్టును బతికించిన సంస్థలు రాజమహేంద్రవరంలో ఇలాంటి వృక్షాలపైన కూడా దృష్టిపెడితే బాగుంటుంది.

ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

క్వారీ గోతులకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి

కమిషనర్ కేతన్‌గార్గ్



ప్రమాదకరంగా ఉన్న క్వారీ గోతుల రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, మే 6(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం క్వారీ గోతుల్లో తరచు మనుషులు, పశువులు ప్రమాదవ శాత్తూ పడి మృతి చెందుతున్నందున వెంటనే ఈ ప్రాంతంలో పెన్సింగ్ వేయాలని మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. మంగళవారం ఆయన 49వ డివిజన్‌లోని క్వారీ ప్రాంతంలో రహదారులు, గోతులను ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రమాదకరమైన పాయింట్లను గుర్తించి మార్కు చేయాలన్నారు. డ్రోన్ సర్వే మాత్రమే కాక గోతులను పూర్తిగా పరిశీలించాలన్నారు. భవన నిర్మాణ వ్యర్థాలతో క్వారీ గోతులను నింపడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గోతుల చుట్టూ, రహదారి బోర్డర్‌లో పెన్సింగ్ వేయాలన్నారు. క్వారీ గోతులపై పూర్తి నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు సమర్పించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఈఈ మదార్లీ, త్రీటౌన్ సీఐ అప్పారావు, ఆర్అండ్‌బీ డీఈఈ, కార్పొరేషన్ టీపీబీవోలు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

'చిత్రకళా సంస్థలను ప్రభుత్వం ఆదుకోవాలి'

రాజమహేంద్రవరం కల్చరల్, మే 6(ఆంధ్రజ్యోతి): జీర్ణావస్థకు చేరుకున్న దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ వంటి చిత్ర కళా సంస్థలను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రముఖ న్యాయవాది, ఆంధ్ర కేసరి డిగ్రీ కళాశాల ఛైర్మన్ మద్దూరి శివ సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ విషయంలో చొరవ చూపాలని ఆయన కోరారు. అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సందర్భంగా మాదేటి రాజాజీ మెమోరియల్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీతారామరాజు జీవిత చరిత్ర రెండురోజుల ఫొటో ఎగ్జిబిషన్‌ను సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిత్రకారులకు, చిత్ర కళా సంస్థలకు ప్రభుత్వం అండగా ఉండాలని, లేకుంటే చిత్ర కళారంగం నిర్వీర్యమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తంచేశారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు మాదేటి ప్రకాష్ మాట్లాడుతూ 18 మంది చిత్రకారులు గీసిన 32 రంగుల చిత్రాలను ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సన్నిధానం శాస్త్రి, ఎన్‌వీఎస్ లక్ష్మి, కోసూరి చండీప్రియ, తారా నగేష్, టి.రవికాంత్, ఎం.విద్యానిధి, వినోద్, వీరభద్రరావు, సీత పాల్గొన్నారు.

వాసవిమాత ఆలయాభివృద్ధికి రూ.5 లక్షల విరాళం



వాసవిమాతను దర్శించుకుంటున్న శ్రీఖాకోళ్లపు

ధవళేశ్వరం, మే 6 (ఆంధ్రజ్యోతి): వాసవి మాత ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షలు విరాళం ఇవ్వనున్నట్టు ఏపీఐఐసీ మాజీ ఛైర్మన్ శ్రీఖాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం ప్రకటించారు. వాసవిమాత జయంతోత్సవాల్లో భాగంగా మంగళవారం విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. యువ వైశ్య ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ చేశారు. సాయంత్రం మహిళా సంఘం ఆధ్వర్యంలో పేరంటం జరిపి ప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని ఏపీఐఐసీ మాజీ ఛైర్మన్ శ్రీగాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం దర్శించి పూజలు నిర్వహించారు. ఆలయాభివృద్ధికి ఆయన విరాళం ప్రకటించారు. అలాగే శివరామ కలర్ ల్యాబ్ అధినేత గోకుల్ మురళి, జనసేన నాయకుడు యడ్ల మహేష్, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

బాల్యం నుంచి విలువలు నేర్పాలి

రంగంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచి మానవత విలువలు అందించే శ్రీసత్య సాయి బాలవికాస్ తరగతులకు చిన్నారులను పంపి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని శ్రీసత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని కోటపాడు గ్రామంలో శ్రీసత్య సాయి బాలవికాస్ వారోత్సవాల సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ సత్య సాయి అందించిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలనే మానవత విలువలతో పాటు, సంఘనీతి, పాపభీతి, దైవప్రీతి అలవాటు చేయాల్సిన బాధ్యత గురువులు, తల్లిదండ్రులు తీసుకోవాలని ఆయన కోరారు. శ్రీసత్య సాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతి, బాలవికాస్ వారోత్సవాలు ముగింపు సందర్భంగా వృద్ధులకు గొడుగులు, పాదరక్షలు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో జోనల్ కన్వీనర్ సీహెచ్ త్రిమూర్తులు, ఎం.వీర్రాజు, కేవీ అమర్నాథ్, టి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఈ-శ్రమ్ కార్డులు పొందాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి



మహిళా ప్రత్యేక కారాగారంలో ఆహారాన్ని రుచి చూస్తున్న శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, మే 6(ఆంధ్రజ్యోతి): అర్హులైన కార్మికులు తప్పకుండా ఈ-శ్రమ కార్డులు పొందాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి సూచించారు. కార్మిక దినోత్సవ వారోత్సవాల సందర్భంగా డీఎల్ఎస్ఏ, కార్మిక శాఖ సంయుక్తంగా బ్లింకిట్ వర్కర్లకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించా రు. కార్మికుల హక్కులు, చట్టాలు, ఈ-శ్రమ్ కార్డుల రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించారు. అసంఘటిత కార్మికుల కోసం నల్సా న్యాయ సేవల పథకం-2015ను వివరించారు. పర్యవేక్షణ గృహాన్ని సందర్శించి బాలల బాగోగులపై ఆరా తీశారు. శ్రీ గౌతమి జీవ కారుణ్య సంఘంలోని వృద్ధాశ్రమంలోని వసతులు, సదుపాయాలను పరిశీలించారు. మహిళా ప్రత్యేక కారాగారంలోని ఖైదీలతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉంటే డీఎల్ఎస్ఏ దృష్టికి తీసుకురావాలన్నారు. నిందితులు, ఖైదీల గురించి పని చేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

'విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ఓపీలు పెంచాలి'

రంగంపేట, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని విలేజ్‌హెల్త్ క్లినిక్‌లలో ఓపీల సంఖ్య పెంచాలని టీడీపీ ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు సూచించారు. వడిశలేరులోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను, ప్రభుత్వ పశువైద్యశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థులను ఆరోగ్య సమస్యలపై చైతన్య పరచి హెల్త్ సెంటర్లకు వచ్చే విధంగా చేసి ఓపీ సంఖ్యను పెంచాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన మందులు వివరాలను తెలుసుకున్నారు. సిబ్బంది హాజరును గోవిందు పరిశీలించారు. పశువులకు సంబంధించి వచ్చిన మందులు, రాయితీపై వచ్చిన పశుదాణా వివరాలు, పశువులకు వేసిన వ్యాక్సినేషన్, గడ్డి విత్తనాలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బాల్య వివాహాలు.. దుష్ప్రభావాలపై అవగాహన



అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

సీతానగరం, మే 6: బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలను ఐసీడీఎస్ సూపర్వైజర్ పెదలక్ష్మి వివరించారు. మంగళవారం చినకొండేపూడి సచివాలయం-1లో కిషోరి వికాసం కార్యక్రమానికి ఏడు అంగన్‌వాడి సెంటర్ల నుంచి కిషోర బాలికలు హాజరయ్యారు. వారికి పెదలక్ష్మి రుతుక్రమం, శారీరక పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. కౌమార దశలో రక్త హీనత రాకుండా తీసుకోవలసిన పౌష్టికాహారంపై అవగాహన కలిగించారు. సెల్‌ఫోన్లకు అలవాటు పడవద్దని, సైబర్ నేరాల గురించి విరించారు. కార్యక్రమంలో సచివాలయం మహిళ పోలీసు ఉదయ్, ఏఎన్ఎం విశాల, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు

తిరుపతిలో వెలమ సంఘీయుల కళ్యాణ మండపం



సమావేశంలో మాట్లాడుతున్న వెలమ సంఘం రాష్ట్ర నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, మే 6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వెలమ సంఘీయుల కళ్యాణ మండపం నిర్మించేందుకు వెలమ సంఘీయులు నిర్ణయించినట్టు ఆ సంఘం రాష్ట్ర నాయకులు స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలోని హోటల్ జగదీశ్వరీలో మంగళవారం సంఘం నగర అధ్యక్షుడు కిలపర్తి శ్రీను అధ్యక్షతన జరిగిన సంఘీయుల సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ జీవీకే కుమార్, రాజాన పండు, శిరపురపు శ్రీను, కర్రి సతీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తిరుపతిలో కళ్యాణ మండపం నిర్మాణంపై చర్చించారు. పలు సూచనలు చేశారు. కళ్యాణ మండపం నిర్మాణ అవకాశం తమకు ఇచ్చిన అపూర్వ అవకాశమన్నారు. దాతలు ముందుకు వచ్చి కళ్యాణ నిర్మాణానికి సహకారం అందించాలని వెలమ సంఘం నేతలు పిలుపునిచ్చారు.

రేపటి నుంచి మదనగోపాలుడి కల్యాణోత్సవాలు

నిడదవోలు, మే 6 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాల స్వామి కల్యాణోత్సవాలు ఈనెల 8 నుంచి 12 వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ మేనేజర్ నామా సూర్య ప్రకాశరావు తెలిపారు. 8న కల్యాణం, 9న గ్రామోత్సవం, 10, 11, విశేష పూజలు, 12న పుష్పయాగోత్సవం జరగనున్నాయి.

పనిదినాల లక్ష్యాలు పూర్తి చేయాలి

» డ్వామా ఏపీడీ రామ్‌ప్రసాద్
» ముగ్గుళ్లలో కాలువ పూడికతీత పనుల పరిశీలన



సీతానగరం కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏపీడీ

సీతానగరం, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధి హామీ పథకం కూలీల పనిదినాల లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలని డ్వామా ఏపీడీ రామ్‌ప్రసాద్ సూచించారు. మంగళవారం ముగ్గుళ్లలో కాలువ పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. అనంతరం సీతానగరం ఎన్ఆర్‌జీఎస్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలన్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్ వారీగా నిర్దేశించిన పనిదినాల లక్ష్యాలను పూర్తి చేయాలని చెప్పారు. సగటు వేతనం రూ.300 వచ్చేలా కొలతల ప్రకారం పని చేయించాలన్నారు. ప్రధాన మంత్రి సురక్షా బీమా కట్టించడానికి ఏడాదికి రూ.20 చెల్లిస్తే సరిపోతుందని, 18 నుంచి 70 ఏళ్ల లోపు వారు ఈ బీమా తీసువాలన్నారు. దీంతో ప్రమాద బీమా రూ.2 లక్షలు దివ్యాంగత్వం ఏర్పడితే రూ.లక్ష అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో సత్యవతి, టెక్నికల్ అసిస్టెంట్ సింహాద్రి వీరబాబు సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలందరికీ ఇన్సూరెన్స్ అవసరం : ఎంపీడీవో

బిక్కవోలు, మే 6(ఆంధ్రజ్యోతి): అనుకోని ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతే ఆయా కుటుంబాలు వీధిన పడకుండా వుండేందుకు ప్రతిఒక్కరూ ఇన్సూరెన్స్ కలిగి వుండాలని ఎంపీడీవో వి.శ్రీనివాస్ ఉపాధి కూలీలకు సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని పందలపాకలో రూ.11 లక్షలతో జరుగుతున్న 9 పంటకాలువల పూడికతీత పనులను, ఊలపల్లిలో రూ.8 లక్షలతో జరుగుతున్న 6 పంట కాలువల పూడికతీత పనులు పరిశీలించి కూలీల మస్తర్లను తనిఖీ చేశారు.అనంతరం ఆయన కూలీలతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజనలో 18 నుంచి 50ఏళ్ల లోపు వారు ఏడాదికి రూ.436 ప్రీమియం చెల్లిస్తే వారు ఏవిధంగా మరణించినా ఆ కుటుంబానికి రూ.2 లక్షల పరిహారం అందిస్తారన్నారు. అలాగే ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనలో 18-70 ఏళ్ల వయసున్న వారు ఏడాదికి రూ.20 ప్రీమియం చెల్లించి వారు ప్రమాదవశాత్తు మరణానికి గురైతే ఆ కుటుంబానికి రూ.2 లక్షలు పరిహారం అందజేస్తారన్నారు. ప్రతిఒక్కరూ బీమా కలిగి వుండాలని ఎంపీడీవో అన్నారు. ఆయన వెంట ఏపీవో అగస్టీన్‌కుమార్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



పందలపాకలో ఉపాధి కూలీల మస్తర్లు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

సంస్కృతీసాంప్రదాయాలను పరిరక్షించాలి

బిర్సాముండా గిరిజన విశ్వవిద్యాలయం వీసీ మధుకర్బాయ్ ఎస్ పద్వి



మధుకర్బాయ్ ఎస్ పద్విని సత్కరిస్తున్న నన్నయ్య సిబ్బంది

దివాన్‌చెరువు, మే 6(ఆంధ్రజ్యోతి): నర్మదా నదీ తీరంలో బిర్సాముండా గిరిజన విశ్వవిద్యాలయం, గోదావరి తీరంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉన్నాయని, వీటి ద్వారా మన సంస్కృతీ సాంప్రదాయాలను పరిరక్షిస్తూ భావితరాలకు వాటిని అందించాలని గుజరాత్‌లోని బిర్సా ముండా గిరిజన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మధుకర్బాయ్ ఎస్.పద్వి అన్నారు. నన్నయ వర్సిటీని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నన్నయ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీని మర్యాదపూర్వకంగా కలిసి పలు విద్య అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఉన్నత విద్యను అందించేందుకు కృషిచేయాలన్నారు. గుజరాత్ విద్యావిధానాన్ని, విశ్వవిద్యాలయ కోర్సుల వివరాలను తెలిపారు. నన్నయ వర్సిటీ వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎక్కువ అనుబంధ కళాశాలలుతో అతిపెద్ద విశ్వవిద్యాలయంగా నన్నయ వర్సిటీ ఉందన్నారు. అనంతరం వీసీ మధూకర్బాయ్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లతో ఉద్యోగ భద్రతకు ముప్పు

కార్మిక, ఉద్యోగ సదస్సులో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్

రాజమహేంద్రవరం అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు అమలైతే కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదని కార్మిక, ఉద్యోగ సదస్సులో పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం రాజమహేంద్రవరం వై.జంక్షన్‌లోని ఆనం రోటరీ హాలులో అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20న అఖిలభారత సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో సమ్మె విజయవంతం కోరుతూ ఈ సదస్సు నిర్వహించారు. సదస్సుకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జే.వెంకటేశ్వరరావు, ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు జోజి, ఐఎఫ్‌టీయూ నాయకుడు ఎస్.కిరణ్ విచ్చేసి మాట్లాడారు. లేబర్ కోడ్లు అమలైతే కార్మికులు అన్ని హక్కులు కోల్పోతారని అన్నారు. యజమానికి నచ్చితే ఉద్యోగం, నచ్చకపోతే తొలగించే విధంగా చట్టాల్లో మార్పులు తెచ్చారని తెలిపారు. కార్మికులను బానిసలుగా మార్చే ఈ లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జేటీ రామారావు, బ్యాంకింగ్ రంగ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఎన్‌జీవో సంఘం నాయకులు ప్రవీణ్, వీసీసీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి పాల్గొని సమ్మె సంఘీభావ సదస్సుకు మద్దతు తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు



రాజమహేంద్రవరంలో బొమ్మలకు రంగులు దిద్దుతున్న విద్యార్థులు

రాజానగరం, మే 6(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోవచ్చని మేజిక్ బస్సు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నాగదేవి అన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా రాజానగరంలోని శాఖాగ్రంథాలయంలో ఎనిమిదో రోజు మంగళవారం విద్యార్థులకు పౌష్టికాహారంపై మేజిక్ బస్సు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ బిడ్డ పుట్టినప్పటి నుంచి 18 ఏళ్ల వయస్సు వచ్చే వరకు వారి మానసిక, భౌతిక ఎదుగుదలకు తీసుకోవాల్సిన వివిధ రకాలైన ఆహార పదార్థాల వివరాలను విద్యార్థులకు వివరించారు. అలాగే ఆటలు మానసిక వికాసానికి ఏవిధంగా దోహద పడతాయో చెప్పారు. ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు వివిధ రకాలైన పద్ధతులను భాగ్యలక్ష్మి నేర్పించారు. వ్యాపారవేత్త మండవిల్లి వెంకన్నబాబు మజ్జిగ వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కలగర సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలకు రంగులు దిద్దుదాం

రాజమహేంద్రవరం కల్చరల్, మే 6(ఆం ధ్రజ్యోతి): స్థానిక ఆర్యాపురం డాక్టర్ ఏబీ నాగేశ్వరరావు మెమోరియల్ పఠనాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా బొమ్మలకు రంగులు దిద్దుదాం కార్యక్రమం జరిగింది. వివిధ పాఠశాలల నుంచి 30మంది విద్యార్థులు పాల్గొన్నారు. బహుమతులను జూన్ 6న అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సభ్యులు కాసాని శంకరరావు, బండి నరేంద్రబాబు, గడ్డం వెంకట రమణ, ఎ.కృష్ణ, శర్మ పాల్గొన్నారు.

రంగంపేట: స్థానిక శాఖాగ్రంథాలయంలో జరిగిన శిక్షణా తరగతుల్లో ముందుగా విద్యార్థులతో సరస్వతీదేవి ప్రార్థన చేయించారు. తదుపరి విద్యార్థులకు తెలుగుభాష ప్రాముఖ్యత, అక్బర్ బీర్బల్ నీతికథలను బోధించారు. ఉపాధ్యాయుడు కె.సూరిబాబు పాల్గొని గణితంలో లాజిక్కులపై శిక్షణ ఇచ్చారు. అనంతరం కాంపిటేటివ్ విద్యార్థి టేకుమూడి శ్రీనివాస్ జనరల్ నాలెడ్జ్‌పై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు నిర్దిష్ట ప్రణాళికలు ఏర్పరచుకొని చదివిన అంశాన్ని అవగాహన చేసుకోవాలని, మహనీయుల, అమరవీరుల జీవితచరిత్రలను చదవాలని గ్రంథాలయాధికారి రామకోటేశ్వరరావు సూచించారు.



రంగంపేటలో విద్యార్థులకు నీతికథలు చెబుతున్న లైబ్రేరియన్

తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు

» ఇష్టం లేకపోతే వెళ్లిపోండి.. ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవొద్దు
» ప్రభుత్వ బోధనాసుపత్రి అధికారులపై ఎమ్మెల్యే ఆదిరెడ్డి ఫైర్
» ఆపరేషన్ థియేటర్‌లో కనీస సౌకర్యాల్లేవని వైద్యుల ఫిర్యాదు



ఆసుపత్రిలో సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బోధనాసుపత్రి వైద్యాధికారులు తీరుమార్చుకోవాలని కోరుతున్నాం. మార్చుకోకపోతే సాగనంపుతాం. నిర్లక్ష్యంగా ఉన్న వైద్యాధికారుల గురించి వైద్యశాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాడుతాం. చర్యలు తీసుకుంటాం అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రికి వచ్చిన ఆయన ఎంసీహెచ్ బ్లాకును తనిఖీ చేశారు. గర్భిణులు, డెలివరీ కోసం వచ్చిన మహిళలు, వారి సహాయకులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళా వైద్యురాలు ఒకరు ఆపరేషన్ థియేటర్‌లో కనీస సదుపాయాలు లేవని, యూనిఫాం ఇవ్వడం లేదని, ఆరు నెలలుగా ఏసీ పని చేయడం లేదని, ఇతర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. డాక్టర్ రాసిచ్చిన మందులు లేవని చెబుతున్నారని, పదిహేను రోజుల నుంచి తిరుగుతున్నా మందులు రాలేదని అంటున్నారని మరొకరు ఫిర్యాదు చేశారు. ఎంసీహెచ్ బ్లాకులో డెలివరీ కోసం వచ్చిన మహిళలకు ఓపీ రాయడానికి అక్కడికీ ఇక్కడికీ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇంకొకరు ఫిర్యాదు చేశారు. వీటన్నింటినీ తీవ్రంగా పరిగణించిన ఎమ్మెల్యే శ్రీనివాస్ మీడియా సమావేశంలో ఆసుపత్రి వైద్యాధికారుల తీరుపై మండిపడ్డారు. తాను, కూటమి నాయకులు అనేకసార్లు ఆసుపత్రికి వచ్చిన సమయంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులకు తెలియజేసినా వాటిలో ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి బాధ్యులెవరని ప్రశ్నించారు. ఇష్టం లేకపోతే వెళ్లిపోండి. ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దని అన్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో మందులు లేకపోతే స్థానికంగా కొనుగోలు చేసే వెసులుబాటు ఉన్నా ఎందుకు కొనడంలేదని అన్నారు. మళ్లీ పదిహేను రోజుల తర్వాత తాను వస్తానని, అప్పటికీ పరిస్థితి మారకపోతే చర్యలు తప్పవని అన్నారు. ఎంసీహెచ్ బ్లాకులో 150 పడకలు సిద్ధంగా ఉన్నాయని, క్రిటికల్ కేర్ బ్లాకు జూన్ నెలాఖరుకు అందుబాటులోకి రానుందని అన్నారు. ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్‌ల పంపిణీ

కోరుకొండ, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మంజూరైన సీఎం సహాయ నిధి నగదును మంగళవారం జనసేన కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అందజేశారు. రాఘవాపురం, నర్సాపురం, కణుపూరు, గాదరాడ గ్రామాల్లో బాధితుల ఇళ్లకు వెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, అడ్డాల శివ, ప్రగడ జోగారావు, ముక్కా రాంబాబు, యర్రంశెట్టి పోలారావు, పెదపాటి భీమరాజు, కట్టా సత్తిబాబు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో విద్యార్థుల విజయకేతనం

రాజమహేంద్రవరం కల్చరల్, మే 6(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం పాత తుంగపాడు గ్రామంలో శ్రీ సత్య సాయి విద్యానికేతన్ స్కూల్లో జరిగిన ఇంటర్ స్టేట్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్-2025 టోర్నమెంట్‌లో రాజమహేంద్రవరం విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. శ్రీ చైతన్య టెక్నోస్కూల్ (సీతంపేట, బొమ్మూరు), బాల మణికంఠ ఇంగ్లీష్ మీడియం స్కూల్, లాసలెట్ విద్యానిలయం ఇంగ్లీష్ మీడియం స్కూల్(తొర్రేడు), శ్రీ సునంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ (జాంపేట) విద్యార్థులు పలు విభాగాల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. విజేతలను ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య సత్కరించారు. చదువుతో పాటు ఆటపాటల్లోను ఆడపిల్లలు రాణించాలని ఆమె అన్నారు. కార్యక్రమానికి పలు విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, కరెస్పాండెంట్లు, డైరెక్టర్లు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన టీడీపీ నేత గన్ని కృష్ణ



మంత్రి లోకేశ్‌ను కలిసి కరచాలనం చేస్తున్న గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసారు. మంగళవారం ఉండవల్లిలోని లోకేశ్ నివాసంలో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని, పథకాలు అమలు చేస్తున్నారని ప్రజలు ఆనందంగా ఉన్నారని చెప్పారు. పీ4 కార్యక్రమం విప్లవాత్మకమని గన్ని హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో గన్ని కృష్ణ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది

పలుచోట్ల మజ్జిగ చలివేంద్రాల ఏర్పాటు

కోరుకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రయాణికులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో కోరుకొండ సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, కోనేరు వద్ద, జంబుపట్నం గణపతి ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రాలను రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజానగరం, జగ్గంపేట, రంపచోడవరం మూడు నియోజకవర్గాల్లోను స్వీయ నిధులతో విద్య, వైద్యం, సంక్షేమ పరంగా ప్రజలకు సహాయ సహకారాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాపన్న దొర, బత్తిన వీరాంజనేయులు, పచ్చారి నరసింహమూర్తి, నాగా రమేష్, నాగా వీరాంజనేయులు, చింతన కన్నారావు, పెనకటి రాంబాబు, దాసరి రాంబాబు పాల్గొన్నారు.

బీసీలకు లబ్ధి పేరుతో కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్న ప్రభుత్వం

వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు దుర్గారావు

కోరుకొండ, మే 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు లబ్ధి చేకూర్చుతామన్న సాకుతో కూటమి ప్రభుత్వం దారుణంగా కాంట్రాక్టర్లకు దోచి పెడుతుందని జిల్లా వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు ఆరోపించారు. కోరుకొండలోని వైసీపీ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ బీసీ మహిళలకు కుట్టుమిషన్ పేరితో కాంట్రాక్టర్‌కు రూ.257 కోట్లు ఇచ్చారని ఇది సంక్షేమ స్కీం కాదని, పెద్ద స్కాం అని ఆరోపించారు. ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.16,700 సొమ్మును కింది నుంచి పైస్థాయి వరకు వాటాలు వేసుకుని పంచుకున్నారన్నారు. ఈ టెండర్ ప్రక్రియలో 65 కంపెనీలు వస్తే అందులో 6 కంపెనీలకు మాత్రమే టెండర్ ఫైనల్ అర్హత ఉందని తేల్చారన్నారు. లబ్ధిదారులకు శిక్షణ మొక్కుబడిగా ఇచ్చారన్నారు. 50 ఏళ్లు దాటిన బీసీలకు పెన్షన్ ఇస్తామని చెప్పి ఎందుకు అమలు చేయడం లేదని దుర్గారావు ప్రశ్నించారు. కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణం!




వక్ఫ్ చట్టాన్ని సవరిస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకిస్తూ ఎన్నడూలేనిది బురఖాలు ధరించి ముస్లిం మహిళలు రోడ్డెక్కారు.. జాతీయ జెండా చేతబూని జై భారత్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.. వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో అజాద్ చౌక్ నుంచి ర్యాలీ సాగింది.

తడిచిన ధాన్యం కొంటాం



ధాన్యం కొనుగోళ్లపై మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

- నూరుశాతం లక్ష్యం
- మిల్లర్లకు ఆదేశాలు
- మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, మే 6 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో రైతులకు అండగా నిలబడాలనే ఉద్దేశంతో నూటికి నూరు శాతం ధాన్యం కొనుగోలు చేస్తున్నామని త్వరితగతిన రైతుల ఖాతాల్లో నగదు కూడా జమ చేస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వర్షం వచ్చి ధాన్యంలో తేమశాతం పెరిగిందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్క రైతు నుంచి ధాన్యం సేకరించి తీరుతామన్నారు. తేమ శాతం పెరిగితే ధాన్యం కొనుగోలు చేయరన్న అపోహలు రైతన్నలు నమ్మవద్దన్నారు.ఏ రకమైన ధాన్యాన్ని అయినా మిల్లర్లు సేకరించి తీరాలని ఆదేశించామన్నారు.తూర్పు గోదావరి జిల్లాలోని నిడదవోలు మండలంలోనే 43,229 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని ఇది రాష్ట్రంలోనే అత్యధికమన్నారు. రైతులంతా సంతృప్తి చెందేలా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు.సమావేశానికి ముందు రెవెన్యూ, వ్యవసాయ శాఖ పౌర సరఫరాలా శాఖ అధికారులతో సమీక్షించారు.నిడదవోలు నియోజకవర్గంలో మత్స్య సంపద వృద్ధి చేసేందుకు సుమారు రూ.1,27,06,075లు విలువైన 255 యూనిట్లకు ప్రతిపాదనలు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, ఏఎస్‌వో ఎం.నాగాంజనేయులు, వ్యవసాయ శాఖ ఏడీ పి.చంద్రశేఖర్,ఏవో జి.సత్యనారాయణ పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, జేసీ

ధాన్యం సేకరణపై కలెక్టర్ సమీక్ష

రాజమహేంద్రవరం రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో గతం కంటే అధికంగా ధాన్యం కొనుగోలు చేశామని అయితే రికార్డుల నిర్వహణ విషయంలో అధికారులు, సిబ్బంది పనితీరు లోప భూయిష్టంగా ఉందని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రబీ సీజన్‌లో ధాన్యం సేకరణపై సమన్వయ శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ క్రాప్ బుకింగ్ ఆధారంగా ధాన్య కొనుగోలు చేస్తున్నారో లేదో క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా మేనేజరు, పౌరసరఫరాల అధికారి ధాన్యం సేకరణ సీజన్‌లో ప్రతిరోజు క్షేత్ర స్థాయిలో ఆర్ఎస్‌కేలు తనిఖీ చేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి, జిల్లా సహకారఅధికారి, నియోజకవర్గ ప్రత్యేకాధికారులకు ఒక్కొక్క నియోజకవర్గం పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని జాయింట్ కలెక్టర్ చిన్నరాముడుకు సూచించారు. రికార్డుల నిర్వ హణ, షెడ్యూల్, కేటాయింపు, కార్యాచరణ, ఈ క్రాప్ బుకింగ్, రవాణా,గన్నీ బ్యాగ్‌లు, తదితర అంశాలపై దృష్టిసారించాలన్నారు.సమావేశంలో ఇన్‌చార్జి డీఎస్‌వో ప్రేమ్‌కుమార్, డీఏవో మాధవరావు, డీసీవో జనార్దనరెడ్డి, ఆర్టీవో రమేష్,డీపీఆర్‌వో బాలకృష్ణ పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న బిక్కవోలు రైతాంగం

ధాన్యం కొనాలని రైతుల వినతి

బిక్కవోలు, మే 6(ఆంధ్రజ్యోతి): తాము పండించిన ధాన్యామంతా మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. జేసీ చినరాముడు మంగళవారం సాయంత్రం బిక్కవోలు తహశీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఈ మేరకు సమాచారం అందుకుని అక్కడికి చేరుకున్న రైతులు తమ వద్ద చాలా ధాన్యం ఉందని.. వర్షం వస్తే తడిచి ఎందుకూ పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందని కొనుగోళ్లకు ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై స్పందించిన జేసీ మాట్లాడుతూ మీ మండలానికి ఇచ్చిన టార్గెట్లు పూర్తయ్యాయని, మిల్లర్లకు అమ్ముకోవాలని సూచించారు. అందుకు రైతులు తిరస్కరించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. మండల వ్యవసాయాధికారి శామ్యూల్‌జాన్ మాట్లాడుతూ మండలానికి 13,500 మెట్రిక్ టన్నుల టార్గెట్ ఇచ్చారని అది పూర్తి చేయడం జరిగిందని, అలాగే రైతులు బయట మార్కెట్‌లో కూడ 16,500 మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్ముకున్నారని జేసీకి తెలిపారు. దీంతో జేసీ 3 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు అనుమతించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, అనపర్తి ఏడీఏ డివి.కృష్ణ, తహశీల్దార్ సత్యకృష్ణ, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ కలవరం!



- వేలల్లో అనుమానిత కేసులు
- 2.0 సర్వేలో 16,432
- 3.0. సర్వేలో 21వేలుపైనే
- కాకినాడలోనే 8,383 కేసులు
- 21 మందికి క్యాన్సర్ నిర్ధారణ
- రాష్ట్రంలోనే కాకినాడ జిల్లా ఫస్ట్
- ఆసుపత్రి ఏర్పాటు యోచన
- రూ.10 కోట్లతో ప్రతిపాదనలు
- కాకినాడ కలెక్టర్ చొరవ
- క్యాన్సర్ పరీక్షలకూ వాహనం

ఉమ్మడి జిల్లాలో విజృంభిస్తోన్న మహమ్మారి

క్యాన్సర్.. ఎప్పుడు వస్తుందో.. ఎక్కడ వస్తుందో.. ఎలా వస్తుందో తెలియదు.. ఏదో అనుమానం ఉంటే తప్ప ప్రాథమిక దశలో గుర్తించడం కూడా కష్టమే. నూటికి 50 నుంచి 60 శాతం కేసులు చివరిలోనే గుర్తిస్తారు.. దాంతో సకాలంలో చికిత్స అందక క్యాన్సర్‌కు ఎందరో బలైపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇటీవల జరిపిన సర్వే విస్తుపోయే నిజం బయటకు వచ్చింది.. మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో క్యాన్సర్ మహమ్మారి విజృంభిస్తోందని తేలింది.. కాకినాడ క్యాన్సర్ అనుమానిత కేసుల్లో తొలిస్థానంలో ఉంటే.. తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాలు 10, 11వ స్థానాల్లో ఉండడం కలవరపెడుతోంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో క్యాన్సర్ అనుమానిత కేసులు కలవరపెడుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ సర్వేలో వేలకు వేలు అనుమానిత కేసులు వెలుగులోకి వస్తున్నాయి. ఏ మండలంలో చూసినా నోటి, సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు ఉన్న బాధితులు ఎక్కువగా తేలుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఎన్‌సీడీ (నాన్ కమ్యునబుల్ డిసీజ్) 2.0 సర్వేలో ఉమ్మడి జిల్లాలో 16,432 మందిలో క్యాన్సర్ అనుమానిత లక్షణాలు గుర్తించగా తాజాగా పూర్తయిన ఎన్‌సీడీ 3.0 సర్వేలో ఏకంగా 20వేలకుపైగా కేసులు వెలుగులోకి రావడం క్యాన్సర్ తీవ్రతను చాటుతోంది.

అంతకంతకూ విజృంభణ..

రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో క్యాన్సర్ కేసులు విజృంభిస్తున్నాయి. మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలి కారణంగా క్యాన్సర్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం జనవరిలో ఆదేశించింది. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇంటింటికీ వెళ్లి ఆయా జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది క్యాన్సర్‌తోపాటు పలు రకాల వ్యాధులపై సర్వే చేశారు. హైపర్ టెన్షన్, డయాబెటిస్, లివర్ వ్యాధులు సైతం భారీగా ఉమ్మడి జిల్లాలో వెలుగులోకి వస్తున్నా వీటికి మించి భయపెట్టేలా క్యాన్సర్ అనుమానిత కేసులు గుర్తిస్తుండడం కలవరపాటుకు గురిచేస్తోంది.

రాష్ట్రంలో కాకినాడ ఫస్ట్..

కాకినాడ జిల్లాలో అత్యధికంగా కేసులు ఉండడం కలవరపెడుతోంది. 2.0 సర్వేలో కాకినాడ జిల్లాలో 6,333 కేసులు గుర్తించారు. 3.0 సర్వేలో ఏకంగా 8,383 కేసులు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటివరకు వీరిలో చాలామందికి పూర్తిస్థాయి టెస్టులు చేయగా 21 మందికి క్యాన్సర్ నిర్ధారణ అయింది. ఇన్ని కేసులతో కాకినాడ జిల్లా రాష్ట్రంలో తొలిస్థానంలో నిలిచింది. ఈనేపథ్యంలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వానికి రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. నిధులు వేగంగా విడుదలచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎస్సార్ నిధుల ద్వారా ప్రత్యేక క్యాన్సర్ స్ర్కీనింగ్ టెస్టులు జరిపే మొబైల్ వాహనాన్ని కూడా అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఈ మేరకు ఓఎన్జీసీతో మాట్లాడారు. ఈ మొబైల్ వాహనం ద్వారా రోజుకు వెయ్యిమందికి టెస్టులు చేసే ఆధునిక పరికరాలు అందుబాటులోకి రానున్నాయి. తద్వారా తక్కువ సమయంలో ఎక్కువ మందికి టెస్టులు చేయవచ్చని కలెక్టర్ వివరించారు. తూర్పుగోదావరి జిల్లా 5,103 అనుమానిత క్యాన్సర్ కేసులతో పదో స్థానంలో నిలిచింది. కోనసీమ జిల్లా 4,996 కేసులతో 11వ స్థానంలో నిలిచింది. ఉమ్మడి జిల్లాలో ఎన్‌సీడీ 2.0 సర్వేలో క్యాన్సర్ అనుమానిత కేసులు 16,432 తేలాయి.

ఉమ్మడి జిల్లాలో అనుమానితులు 21 వేలు

- గత మార్చిలో ప్రభుత్వం మూడో దశ ఎన్‌సీడీ సర్వే చేపట్టింది. ఈ సర్వేలోనూ క్యాన్సర్ అనుమానిత కేసులు ఉమ్మడి జిల్లాలో ఏకంగా 21 వేలు గుర్తించారు. కాకినాడ జిల్లాలో అయితే 3.0 సర్వేలో ఏకంగా 8,383 అనుమానిత కేసులు గుర్తించారు. ఓరల్ క్యాన్సర్ విభాగంలో 3,995, బ్రెస్ట్ క్యాన్సర్ విభాగంలో 2,337, సర్వైకల్ క్యాన్సర్ విభాగంలో 2,051 మంది అనుమానితులుగా గుర్తించారు. వీరిని కాకినాడ జీజీ హెచ్‌కు రిఫర్ చేశారు. ఇలా ఓరల్ క్యాన్సర్ పరీక్షలకు పంపిన 56 మందిలో 12 మందికి క్యాన్సర్ నిర్ధారణ అయింది. బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు ఉన్న 78 మందిలో ఐదుగురికి క్యాన్సర్‌గా తేలింది. సర్వైకల్ క్యాన్సర్ లక్షణాలు ఉన్న 21 మందిలో నలుగురికి వ్యాధి నిర్ధారణ అయింది.
- తూర్పుగోదావరి జిల్లాలో 6,413 మందిలో అనుమానిత లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. ఓరల్ క్యాన్సర్ విభాగంలో 3,186 అనుమానిత కేసులు గుర్తించగా లోతైన వైద్య పరీక్షలకు 44 మందిని రాజమహేంద్రవరం జీజీహెచ్ అంకాలజీకి రిఫర్ చేశారు. బ్రెస్ట్ క్యాన్సర్ విభాగంలో 1,800 అనుమానిత కేసులుండగా 97 మందిని లోతైన టెస్టులకు రిఫర్ చేశారు. సర్వైకల్ క్యాన్సర్ విభాగంలో 1,427 అనుమానితులను గుర్తించగా 24 మందిని జీజీహెచ్‌కు పంపారు. ఈ అనుమానిత కేసుల్లో నలుగురికి బ్రెస్ట్ క్యాన్సర్, మరో నలుగురికి ఓరల్ క్యాన్సర్ నిర్ధారణ అయింది. మిగిలిన వారికి పరీక్షలు జరుగుతున్నాయి.
- కోనసీమ జిల్లాలో ఎన్‌సీడీ 2.0 సర్వేలో 4,996 కేసులు గుర్తించగా తాజా సర్వేలో ఐదు వేలకుపైగా అనుమానితులను గుర్తించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనుమానిత కేసులు, నిర్ధారణ అవుతున్న కేసులు అంతకంతకూ పెరుగుతున్నట్టు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వివరించారు. బాధితుల్లో ఎక్కువగా 40 నుంచి 64 ఏళ్ల మధ్య వయసున్న వారు అధికంగా ఉంటున్నారని తేలింది.



బలభద్రపురంలో క్యాన్సర్ పరీక్షలు (ఫైల్)

అసెంబ్లీ వేదికగా బిక్కవోలు మండలం బలభద్రపురంలో క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్టు అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. సుమారు ఆ ఒక్కగ్రామంలో 40 మంది క్యాన్సర్ బాధితులను గుర్తించి ఆసుపత్రులకు తరలించారు. ఆ గ్రామంలో కేసులు వేలల్లో ఉంటాయని వాదన.

రూ.10 కోట్లతో ఆసుపత్రి..

క్యాన్సర్ విజృంభణ కారణంగా కాకినాడలో ప్రత్యేకంగా క్యాన్సర్ ఆసుపత్రి నిర్మించాల్సి ఉందని కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఈ మేరకు రూ.10 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపారు. ఆస్పత్రి నిర్మాణానికి స్థలం జీజీహెచ్‌కు సమీపంలో ఉందని నివేదికలో వివరించారు. కాకినాడ జీజీహెచ్ అంకాలజీ విభాగంలో నిపుణులైన క్యాన్సర్ వైద్యులు ఉన్నారన్నారు. నిధులు విడుదల చేయాలని కోరారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ స్ర్కీనింగ్ చేస్తారు. అనుమానితులు వెళ్లి పరీక్షలు చేయించుకునే అవకాశం ఉంది. ఈ కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉంటారు. పరీక్షించి వెంటనే ఫలితం చెబుతారు.

గోదావరి వరదలను ఎదుర్కొందాం 7

కుమార్తె కళ్లెదుటే.. తండ్రి దుర్మరణం 8

నేటి నుంచి రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణ

రాజమహేంద్రవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం గ్రామ వార్డు సచివాలయాల ద్వారా రేషన్ కార్డులోని ఏడు రకాల సేవలకు సంబంధించి బుధవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని జేసీ చిన్నరాముడు మంగళవారం రాత్రి తెలిపారు. కొత్త రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల జోడింపు, సభ్యుల తొలగింపు, కార్డు సరెండర్, చిరునామా మార్పు, ఆధార్ సీడింగ్‌లో దిద్దుబాట్లకు అవకాశం కల్పించారన్నారు. ఈ మేరకు మండల అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు.ఈ సేవలను జీఎస్‌డబ్ల్యుఎస్ ఏపీ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ద్వారా కూడా చేసుకోవచ్చన్నారు.

నేడు డీఎస్‌పీసీఏ సమీక్ష

రాజమహేంద్రవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన జిల్లా జంతు హింస నివారణ సంఘం (డీఎస్‌పీసీఏ) సమీక్ష సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నామని జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి, డీఎస్‌పీసీఏ కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ చైర్‌పర్సన్‌గా, జిల్లా పోలీస్ అధికారి, జంతు ప్రేమికుల్లో ఒకరు వైస్ చైర్‌పర్సన్లుగా, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ కోశాధికారిగా, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి కార్యదర్శిగా ఉంటారన్నారు. యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా సంఘం రిజిస్ట్రేషను జరిగిందన్నారు.సంఘంలోని వారంతా సమీక్షకు హాజరు కావాలని శ్రీనివాసరావు కోరారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ఆర్ట్స్ కళాశాల గ్రాడ్యుయేషన్‌డేలో వీసీ ప్రసన్నశ్రీ

రాజమహేంద్రవరం అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ప్రతికూల పరిస్థితులను, సవాళ్లను ఎదుర్కొనే దృఢమైన వైఖరిని పెంపొందించుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రసన్నశ్రీ అన్నారు. రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో మంగళవారం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల పోస్టుగ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. 2018, 2019, 2020 సంవత్సరాల్లో చదివిన 14 గ్రూపుల్లోని 480 మంది విద్యార్థులకు ఒరిజినల్ డిగ్రీలను ప్రదానం చేశారు. నన్నయ్య వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికతో కూడిన విద్యను అభ్యసించి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. గుజరాత్ బీఎంటీయూ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ మధుకర్ భాయ్ ఎస్ పథ్వీ మాట్లాడుతూ సేవా దృక్పథంతో, సమాజం పట్ల బాధ్యతతో విద్యార్థులు ముందుకు సాగాలని కోరారు. నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే కళాశాల గత నాలుగేళ్లలో సాధించిన ప్రగతిని వివరించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పి.బాబ్జి మాట్లాడుతూ పరీక్షలకు సంబంధించిన నివేదికను అందించారు.కార్యక్రమంలో సీపీడీసీ సెక్రటరీ తుమ్మిడి రామ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, ప్రిన్సిపాల్ రామచంద్ర



పదింతల ఆనందం

22 మంది పది విద్యార్థులకు అభినందన

రాజమహేంద్రవరం, మే 6(ఆంధ్రజ్యోతి): కలలను సాకారం చేసుకొనే దిశలో విజయం సాధించడానికి దగ్గర దారులుండవని, లక్ష్యాన్ని నిర్ణయించుకొని శ్రమించడమే మార్గమని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 580కిపైగా మార్కులు సాధించిన 22 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో అభినందించారు.అనంతరం వారితో భోజనం చేశారు.కలెక్టర్ మాట్లా డుతూ స్వతంత్రంగా ఆలోచించాలన్నారు.తన జీవితంలో ఎందరో ఆదర్శ వ్యక్తులను మోడల్‌గా ఎంపిక చేసుకొని శ్రమించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం జరిగిందన్నారు. నిరంతర శ్రమ, అభ్యసనం ద్వారా మాత్రమే ఉన్నతమైన లక్ష్యాలను చేరుకోగలమని ఎస్పీ నరసింహ కిశోర్ అన్నారు.జేసీ చిన్న రాముడు మాట్లాడుతూ ఒక పూట అన్నం కోసం ఎదురు చూసే కుటుంబం నుంచి వచ్చి ఎంతో శ్రమించి తాను ఈ స్థాయిలో ఉన్నానని, చదువుతోనే మంచి మార్పు సాధ్యమన్నారు.తాను ఎనిమిది రకాల ఉద్యోగా లను చేసి..నిరంతర శ్రమ, పట్టుదల, క్రమశిక్షణ మాత్రమే నా ఐఏఎస్ కల నిజం చేశాయని కమిషనర్ కేతన్ గార్గ్ వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

'ఈశ్రమ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి'


కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి

కొవ్వూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఈ శ్రమ పోర్టల్‌లో అసంఘటితరంగ కార్మికులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కొవ్వూరు సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి సూచించారు. మంగళవారం వాడపల్లి బంగారంపేట సచివాలయంలో అసంఘటితరంగ కార్మికులకు మండల లీగల్ సెల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు గతవారం రోజులుగా కార్మికులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ శ్రమ పోర్టల్‌లో పేరు నమోదు చేయించుకుంటే, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఇన్సూరెన్స్ వస్తుందన్నారు. గతంలో పేర్లు నమోదు చేయించుకున్నవారు రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. అర్హత కలిగినవారు ఉచిత న్యాయ సహాయం కోసం మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించవచ్చన్నారు. న్యాయవాదులు ఎస్‌టీ కాంతిధర్, ఉపాధి హామీ పథకం కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం


పేదలకు వస్తువులు అందిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

కొవ్వూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): వేసవిలో పాదచారుల సౌకర్యార్థం వాసవీ క్లబ్ అందజేస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని అన్నారు. కొవ్వూరు అచ్చాయమ్మకాలనీలో మంగళశారం వాసవీ క్లబ్ రీజియన్ చైర్మన్ అధికారిక పర్యటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు మన్యం గుప్తా 18 మందికి పాదరక్షలు అందజేశారు. అలాగే కంకటాల వెంకటరాజు సహకారంతో గ్లూకోజ్, బార్లీ, చోడిపిండి, బియ్యం రవ్వ కలిపిన కిట్లు 300 మందికి, కె.సురేష్ సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా సూరపనేని చిన్ని, వాసవీ క్లబ్ రీజియన్ చైర్మన్ ఆలపాటి అచ్యుతలక్ష్మి హాజరయ్యారు. కార్యక్రమంలో కార్యదర్శి సత్యవరపు గురునాథ్, కోశాధికారి సత్యవరపు భరత్, వలివేటి ప్రసాద్, చెక్కా గౌతమ్, మద్దుల సత్యనారాయణ, మద్దుల నాని, కాకి అనిల్ సూర్య, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు


ఆలయంలో ధ్వజారోహణం నిర్వహిస్తున్న దృశ్యం

దేవరపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి తృతీయ వార్షికోత్సవం, బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయం వద్ద ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం శ్రీవారి మూలమూర్తి స్నాపన తిరుమంజనం, స్వామివారి తిరువీధి ఉత్సవం, ధ్వజారోహణం, గరుడ ప్రసాద వితరణ, ఉత్సవమూర్తులకు అభిషేకం, మంగళశాసనం, సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన, కుంభకళా ఆవాహనం, నిత్యహోమం, తిరువీధుల్లో గరుడ వాహ నసేవ, తీన్‌మార్ డప్పులతో తిరువీదుల్లో అంగరంగ వైభవంగా స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, స్థానికులు యాగంటి శ్రీనివాస్, యాగంటి వెంకటేశ్వరరావు, గుడ్ల వెంకటేశ్వరరావు, తీగల బలరామయ్య, కొండపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవమూర్తులకు అభిషేకం

9న మండల సర్వసభ్య సమావేశం

దేవరపల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 7న జరగాల్సి ఉండగా, 9వ తేదీకి వాయిదా పడినట్టు ఎంపీడీవో వేణుగోపాల రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ మధ్యాహ్నం 2.30 నిమిషాలకు మార్పటం జరిగిందని తెలిపారు. ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు గమనించాలని ఆయన కోరారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యం

● మెగా జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణలో మంత్రి కందుల దుర్గేష్


జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి, తదితరులు

నిడదవోలు, మే 6 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకే ఈ నెల 9వ తేదీన స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మంగళవారం నిడదవోలు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 45 మల్టీ నేషనల్ కంపెనీల ద్వారా 1302 మందికి ఉద్యోగాలు కల్పించే దిశగా మేళా నిర్వహిస్తున్నామన్నారు. రూ. 12 వేల నుంచి రూ. 40 వేల వరకు జీత భత్యాలు ఉంటాయన్నారు. జాబ్ మేళాలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ పురందేశ్వరి, కలెక్టర్ పి.ప్రశాంతి, మాజీ ఎమ్మెల్యే శేషారావు, ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొంటారని మంత్రి తెలిపారు.

కామేశ్వరరావుకు డాక్టరేట్



చాగల్లు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలం లోని బ్రాహ్మణగూడెంకి చెందిన దొమ్మేటి కామేశ్వరరావుకు డాక్టరేట్ అవార్డు లభించింది. మంగళవారం ఆయన తెలిపిన వివరాలివి ... కాకినాడ జేఎన్‌టీయూలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తిచేశాను. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో (ఎంజీఐటీ) లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. ఎక్స్‌పెరిమెంటల్ ఆఫ్ న్యూమ రికల్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ ఏ సోలార్ వీవీ ప్యానల్ యూసింగ్ పీసీఎం అనే అంశంపై సిద్ధాంత వ్యాసానికి జేఎన్‌టీయూకే అధికారులు, నిపుణుల ఆమోదముద్ర లభించింది. ఎంజీఐటీ కళాశాలలో పనిచేసే ప్రొఫెసర్లు డాక్టర్ కే. సుధాకర్‌రెడ్డి, కాకినాడ జేఎన్‌టీయూకే యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం డాక్టర్ వీవీ సుబ్బారావు పర్యవేక్షణలో ఆయన సిద్ధాంతాన్ని రూపొందించానని చెప్పారు.

గర్భిణులకు సకాలంలో వైద్యం అందించాలి


సమావేశంలో ఓఆర్ఎస్ కలిపే విధానం గురించి వివరిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గర్భవతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారికి వివరించాలని వేలివెన్ను పీహెచ్‌సీ డాక్టర్ ఇర్ఫాన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో జరిగిన ఆశాడే సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రమాదకర గర్భవతులను త్వరితగతిని గుర్తించి, వారికి సకాలంలో వైద్య అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ సృజన, సూపర్‌వైజర్ కె.సుభాషిణి, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

'పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది'


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

ఉండ్రాజవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. మంగళవారం వేలివెన్నులో నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాలకు చెందిన 25 మందికి వివిధ అనారోగ్య కారణాలతో ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.10.79 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు తక్షణమే వైద్యఖర్చుల నిమిత్తం సొమ్మును అందజేస్తుందని చెప్పారు. ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలి


నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో చెస్ ఆడుతున్న చిన్నారులు

నల్లజర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని నల్లజర్ల శాఖా గ్రంథాలయ నిర్వాహకురాలు ఏవీ రమణ అన్నారు. మంగళవారం గ్రంథాలయంలో విద్యార్థులకు చెస్, క్యారమ్స్ వంటి ఆటలు ఆడించారు. అలాగే రిసోర్స్‌పర్సన్ ఎస్. దుర్గ విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు నేర్పించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ టీ. సుదర్శన్ పాల్గొన్నారు.

ధాన్యం విక్రయించిన ఐదు గంటల్లో నగదు జమ : ఎమ్మెల్యే


ధాన్యం కొనుగోలుపై రైతులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి, ఆర్డీవో

కొవ్వూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రైతులు ధాన్యం విక్రయించిన ఐదుగంటల్లోనే నగదు ఖాతాల్లో జమ చేస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం రాత్రి ధాన్యం కొనుగోలుపై ఆర్డీవో రాణీసుస్మిత ఆధ్వర్యంలో అధికారులు, మిల్లర్లు, రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాకు అదనంగా 50 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యాన్ని కేటాయించారు. దానిలో ప్రస్తుతం కొవ్వూరు నియోజకవర్గానికి 10 మెట్రిక్ టన్నుల ఇవ్వాలని, అలాగే మరో 10 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసేలా నియోజకవర్గాన్ని ప్రత్యేక దృష్టితో చూడాలని జాయింట్ కలెక్టర్‌ను ఫోన్‌లో ఎమ్మెల్యే ముప్పిడి కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అధిక వర్షాలకు ఎక్కడా పంట నష్ట పోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో ప్రధానంగా రైతులు వరి ఎక్కువగా పండిస్తున్నారన్నారు. మద్దిపట్ల శివరామకృష్ణ, ద్విసభ్య కమిటి సభ్యుడు కంటమణి రామకృష్ణ మాట్లాడారు. ఆర్డీవో రాణీసుస్మిత మాట్లాడుతూ ఇప్పటి వరకు నియోజకవర్గమైన కొవ్వూరులో 28881, చాగల్లులో 21885, తాళ్ళపూడిలో 18395 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. జిల్లా మొత్తం మీద 2,66, 280 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశా మన్నారు. ప్రజాప్రతినిదుల చొరవతో అదనంగా మరో 50 వేలు మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్న, వట్టికూటి వెంకటేశ్వరరావు, చావా శ్రీనివాస్, మద్దిపాటి సత్యనారాయణ, తహశీల్దార్ ఎం. దుర్గాప్రదేశ్, వ్యవసాయ అధికారులు రైసుమిల్లర్లు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ట్రావెల్ బ్యాగులో నగదు దొంగతనంపై కేసు

కొవ్వూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : ట్రావెల్ బ్యాగులో నగదు దొంగతనంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. దొమ్మేరుకి చెందిన మద్దల లక్ష్మీసాయి రామజ్యోతి తన అత్తగారికి అనారోగ్యం కారణంగా ఈనెల 5వ తేదీన రూ. 1,70,000 నగదును బ్యాగ్‌లో సర్దుకుని సింగవరం నుంచి నిడదవోలు ఆసుపత్రికి వచ్చింది. ఆసుపత్రిలో అత్తకు చికిత్స చేయించి ఆటోలో సింగవరం పంపించిన అనంతరం బస్టాప్‌కి వచ్చి 20 నిమిషాలు వెయిట్ చేసింది. అనంతరం తాడేపల్లిగూడెం నుంచి రాజమహేంద్రవరం వెళ్లే పల్లెవెలుగు బస్సు ఎక్కి కొవ్వూరు టోలిగేట్ వద్ద దిగింది. అక్కడి నుంచి తన తండ్రికి ఫోన్ చేయగా బండిపై టోల్‌ప్లాజా వద్దకు ఆయన వచ్చాడు. తండ్రితో పాటు లక్ష్మీసాయి రామజ్యోతి దొమ్మేరులోని అమ్మగారి ఇంటికి వెళ్లింది. తీరా అక్కడ బ్యాగును ఓపెన్ చేసి చూడగా నగదు కనిపించకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ ప్రకాష్ తెలిపారు.

రేపటి నుంచి స్వామివారి కల్యాణోత్సవాలు



నిడదవోలు, మే 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామ సమేత మదనగోపాల స్వామి పాంచాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవాలు ఈనెల ఎనిమిదో తేదీ నుంచి 12 వరకు ఘనంగా నిర్వహిస్తు న్నట్టు ఆలయ మేనేజర్ నామా సూర్య ప్రకాశరావు, ఆలయ అర్చకులు గోవర్ధనం దుర్గాప్రసాదాచార్యులు తెలిపారు. 8వ తేదీ సుప్రభాత సేవతో ప్రారంభమై సాయంకాలం రుక్మిణీ సత్యభామ సమేతకల్యాణం, 9వ తేదీ విశేష పూజలు, గ్రామోత్సవం, 10వ తేదీ సహస్రనామ పూజలు, విష్ణులక్ష్మి సహస్రనామ పారాయణాలు, 11వ తేదీ విశేష పూజలు, 12వ తేదీ స్వామి, అమ్మవార్లకు పుష్పయాగోత్సవం, పవళింపుసేవ జరగనున్నాయి. భక్తులంతా పెద్దఎత్తున పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో మెరిట్ లిస్టు జాబితా

కొవ్వూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పోస్టులకు అభ్యర్థుల నుంచి స్వీకరించిన అర్జీలను సరిచేసి వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారి ఎం. పద్మ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో పొందుపర్చిన ప్రొవిజనల్ మెరిట్ లిస్టుల జాబితా నిమిత్తం అభ్యర్థుల నుంచి 2025 ఏప్రిల్ 11 నుంచి 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించిన అర్జీలు, గ్రీవెన్స్‌లను సరిచేసి వాటి స్పీకింగ్ ఆర్డరును, ఫైనల్ మెరిట్ లిస్టుల జాబితాలను మే 7వ తేదీ నుంచి ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో పొందుపర్చడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు ఎన్ఐసీ వెబ్‌సైట్‌ను చూసుకోవాలని ఆమె తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్త, అతని బంధువులపై కేసు

కొవ్వూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): భార్యను వేధిస్తున్న భర్త, అతని బంధువులపై కేసునమోదు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఎం. సత్యనారాయణ తెలిపారు. పోలవరానికి చెందిన బారోతు లక్ష్మీ గాయిత్రికి కొవ్వూరు మండలం ఆరికిరేవులకి చెందిన జెట్టి శివ అంజితో వివాహం జరిగింది. వీరు కొవ్వూరు పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో నివాసముంటున్నారు. కొంతకాలంగా శివ అంజి చెడు వ్యసనాలకు అల వాటు పడి భార్యను అధిక కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. అందుకు అత్త, మామ సహకరిస్తున్నారని లక్ష్మీ గాయిత్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

కిశోర బాలికలు అప్రమత్తంగా ఉండాలి


ఘంటావారి గూడెంలో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నల్లజర్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఏసీడీపీవో పద్మావతి అన్నారు. మంగళవారం ఘంటావారి గూడెంలో కిశోర బాలికలకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం. హారతి, దుర్గ, ఐ .రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని ఆయా గ్రామ సచివాలయాల్లో కిశోర బాలికల వికాసం, పరిశుభ్రతపై బాలికలకు మంగళవారం అవగాహన కల్పించారు. నెలటూరులో జరిగిన కార్యక్రమానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు తనూజ హాజరై యుక్తవయస్సులో జరిగే రుతుక్రమం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి. పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యురాలు తనూజ

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే మద్దిపాటి పరామర్శ


చిట్యాలలో గంగారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, మే 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు నందిన సుబ్రహ్మణ్యం తండ్రి నందిన గంగారావు ఇటీవల కన్నుమూశారు. అలాగే వాదాలకుంటకి చెందిన వడ్లమూడి రమేష్ మాతృమూర్తి వడ్లమూడి సుబ్బలక్ష్మి మంగళవారం మృతి చెందారు. ఈ ఇరు కుటుం బాలను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మంగళవారం పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో పనిచేసిన ప్రతి ఒక్కరికీ టీడీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, సమన్వయ కమిటీ సభ్యులు గద్దే హరిబాబు, కొర్లపాటి రాము, వేములనాగరాజు, నందిన సుబ్రహ్మణ్యం, గద్దే దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

జ్యేష్ట శ్రీధర్‌కు పదవీ బాధ్యతలు అప్పగించాలని వినతి


గోపాలపురంలో ఎమ్మెల్యేను కలిసేందుకు వెళ్తున్న గ్రామ కమిటీ అధ్యక్షుడు జ్యేష్ట శ్రీధర్, తదితరులు

గోపాలపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం గ్రామ కమిటీలో ఇప్పటివరకు పనిచేసిన జ్యేష్ట శ్రీధర్‌కు ఆ పదవీ బాధ్యతలు అప్పగిం చాలని గోపాలపురం నాయకులు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును క్యాంపు కార్యాలయంలో కలిసేందుకు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా మద్దిపాటికి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ నిర్మాణ క్రమంలో భాగంగా కష్టపడి పని చేసిన ప్రతిఒక్కరినీ పార్టీ గుర్తిస్తుందన్నారు. వారి సేవలు పరిగణలోకి తీసుకుని ఏకాభిప్రాయంతో కమిటీల నియామకం కోసం సమన్వయ కమిటీలు ఏర్పాటుచేసినట్టు చెప్పారు.

వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ ఎంపీటీసీ కూనపం ప్రసాద్‌బాబు, మాజీ సర్పంచ్ తానేటి రాఘవులు, భూరెడ్డి వాసు, అభిరామ్, కొడవటి గంగరాజు, చోళ్ల నాని, కొడవటి చినవెంకటేష్, వేములూరి రవి, తదితరులు ఉన్నారు.

పశివేదల, ఆరికిరేవుల రోడ్డు నిర్మాణానికి...

రూ. 2.30 కోట్ల నాబార్డు నిధులు


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : పశివేదల, ఆరికిరేవుల రోడ్డు నిర్మాణానికి రూ. 2.30 కోట్ల నాబార్డు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం రాత్రి అధికారులతో సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాబార్డు నిధులు రూ. 2.30 కోట్లతో పశివేదల, ఆరికిరేవుల ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతులు, రూ. 2.70 కోట్లతో పెనకనమెట్ట, కుమారదేవం బీటీ రోడ్డు, జిల్లా పరిషత్ నిధులు రూ. 28.50 లక్షలతో చాగల్లు మండలంలో డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివ రామకృష్ణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


అంబులెన్స్‌లో క్షతగాత్రుడ్ని ఆసుపత్రికి తీసుకెళుతున్న దృశ్యం

నల్లజర్ల, మే6 (ఆంధ్రజ్యోతి): ప్రకాశరావుపాలెం శివారులో మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం కన్నపురానికి చెందిన భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డికు తీవ్రగాయాలయ్యాయి. వివరాలివి... వీరిద్దరూ బైక్‌పై కన్నపురం నుంచి తాడేపల్లిగూడెం వెళుతుండగా ప్రకాశరావుపాలెం శివారులో కారును అధిగమించే క్రమంలో అదే కారు కిందపడి తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎటువంటి కేసు నమోదు కాలేదని ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి


వర్మీకంపోస్టును పరిశీలిస్తున్న డ్వాక్రా మహిళలు

ఉండ్రాజవరం, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించాలని ఈవోపీఆర్డీ కే. ఆంజనేయశర్మ పేర్కొన్నారు. మంగళవారం పాలంగిలో ఎస్‌డబ్ల్యూఎం షెడ్డు వద్ద ఆ గ్రామస్థులు, డ్వాక్రా మహిళలకు స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తడిచెత్త, పొడిచెత్త సేకరణ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ బొక్కా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఎండీ హసన్‌జానీ, సచివాలయ సిబ్బంది జి. రామకృష్ణ, ఎం. జ్యోతిర్మయి, డ్వాక్రా మహిళలు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె కళ్లెదుటే... తండ్రి దుర్మరణం



రోడ్డుపై పడి ఉన్న వెంకటరమణ మృతదేహం

ధవళేశ్వరం, మే 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. మంగళవారం ఉదయం ధవళేశ్వరం ప్రధాన రహదారిపై జరిగిన ఈ దుర్ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. సీతానగరం మండలం బొబ్బిల్లంక గ్రామానికి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ హెడ్ కానిస్టేబుల్ బత్తిన వెంకటరమణ(56) కుటుంబంతో కొంతమూరులో ఉంటూ రాజమహేంద్రవరంలో విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం తనకు కేటాయించిన విధులు నిర్వర్తించడానికి వేమగిరి వెళుతూ తన కుమార్తెను బ్యారేజి సెంటర్ వద్ద బస్సు ఎక్కించడానికి ద్విచక్రవాహనంపై తీసుకువెళుతూ ధవళేశ్వరం సినిమా థియేటర్ సెంటర్ సమీపంలోకి వస్తుండగా రాజోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాజమహేంద్రవరం నుంచి వస్తూ సైడ్ నుంచి ఢీకొట్టడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి వెంకటరమణ బస్సు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో కుమార్తెకు ఎటువంటి గాయాలు కాలేదు. ప్రమాద సమాచారం అందుకున్న ధవళేశ్వరం సీఐ గణేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటరమణ కుటుంబ సభ్యులను ఎస్పీ నరసింహకిషోర్ పరామర్శించి, ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పిడుగుపడి మహిళకు గాయాలు

తాళ్లపూడి, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నదేవరపేటలో ఇటీవల కురిసిన వర్షానికి ఓ ఇంటిపై పిడుగుపడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని బొర్రా వీరలక్ష్మి అనే మహిళ ఇంటిపై పిడుగుపడడంతో ఇళ్లు పాక్షికంగా వెబ్బతినడమే కాకుండా ఆమె కూడా గాయాలపాలైంది. దీంతో వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో జాయిన్ చేశారు. అన్నదేవరపేట వీఆర్‌వో కావూరి నాగేశ్వరరావు ఇచ్చిన నివేదిక ప్రకారం ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, తదితర అధికారులు ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడిన ఇన్‌చార్జి తహశీల్దార్ ఆమె కోలుకోవడానికి కనీసం ఐదురోజులు పడుతుందని తెలిపారు. వీరలక్ష్మికి వైద్యఖర్చుల నిమిత్తం రూ. 8000 అందించామన్నారు.